ప్రజాశక్తి

ఆదివారం జనవరి 4 2026 పేజీలు 12



విజయనగరం

పార్వతీపురం మన్యం

భోగాపురానికి నేడు తొలి విమానం

- ట్రయల్ రన్ ప్రారంభించనున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు
- ఢిల్లీ నుండి నేరుగా భోగాపురానికి విమానంలో రాక

సిద్ధమైన రన్‌వే

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి/భోగాపురం

మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు పేరిట రూపుదిద్దుకుంటున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం శరవేగంగా వాస్తవ రూపం దాల్చుతోంది. ప్రారంభానికి సిద్ధమవుతున్న నేపథ్యంలో ట్రైల్ రన్‌గా ఆదివారం ఢిల్లీ నుంచి ఎయిర్ ఇండియా విమానం ఉదయం 10.15 గంటలకు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఇతర విమానయాన శాఖ అధికారులతో రానుంది. ప్రముఖ జిఎంఆర్ గ్రూప్ ఈ విమానాశ్రయాన్ని నిర్మిస్తోంది. దీనికి పౌర పనుల కాంట్రాక్టును ఎల్ అండ్ టి సంస్థ చేపట్టింది. వీరు 40 ఏళ్ల పాటు నిర్వహణ బాధ్యతలు చేపడతారు. సుమారు 3.8 కిలోమీటర్ల పొడవైన రన్‌వేను ఇక్కడ నిర్మిస్తున్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద విమానాలైన ఎయిర్ బస్ ఎ380, బోయింగ్ 47-8 వంటి భారీ విమానాలు వైడ్-బాడీ విమానాలు కూడా ఇక్కడ సులభంగా ల్యాండ్ అయ్యేలా నిర్మాణం చేయడం ఈ ఎయిర్‌పోర్టు ప్రత్యేకతగా ఉంటుందని జిఎంఆర్ గ్రూపు

ప్రతినిధి ప్రభాకర్ రావు, ఎయిర్‌పోర్టు సిఇఒ రణబీర్‌సింగ్ తెలిపారు.

తొలి ఏడాది 60 లక్షల మంది ప్రయాణీకులు

ముఖ గుర్తింపు ద్వారా పేపర్ లెస్ ఎంట్రీ.10 కంటే ఎక్కువ ఆధునిక ఏరోబ్రిడ్జిల ద్వారా నేరుగా విమాన ప్రవేశం. గంటకు 2,500 మంది ప్రయాణికులను నిర్వహించగల సామర్థ్యంతో సోలార్ పవర్, వర్షపు నీటి రీసైక్లింగ్ ద్వారాల లీడ్ గోల్డెన్ రేటింగ్ లక్ష్యంగా నిర్మాణం సాగుతోంది. మొదటి దశలో ఏటా 60 లక్షల మంది ప్రయాణికులను నిర్వహించేలా టెర్మినల్ నిర్మిస్తున్నారు. భవిష్యత్తులో దీనిని 1.8 కోట్ల వరకు పెంచే అవకాశం ఉంది. గత డిసెంబర్ నాటికి 91.7శాతం పైగా పనులు పూర్తికాగా జనవరి 4 న విమానాల ట్రయల్ రన్ నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. జూన్‌లో విమాన రాకపోకలు ప్రారంభం కానున్నాయి. ఈ ప్రాజెక్ట్ కోసం సుమారు 4,592 కోట్లు తొలి దశలో ఖర్చు చేస్తున్నారు. భోగాపురం సమీపంలో 136 ఎకరాల్లో దేశంలోనే తొలి ఏవియేషన్ ఎడ్యుకేషన్ సిటీని ఏర్పాటు చేస్తున్నారు. విమానాశ్రయం నుండి 45కి.మీ దూరంలో విశాఖనగరం ఉన్నప్పటికీ, ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా ప్రభుత్వం మూడు ప్రధాన మార్గాలను సిద్ధం చేస్తోంది. 6-లేన్ నేషనల్ హైవేను ఎన్‌హెచ్ 16 నుండి నేరుగా ఎయిర్‌పోర్ట్‌కు అప్రోచ్ రోడ్లు, ఫ్లైఓవర్లు నిర్మిస్తున్నారు. విశాఖ పోర్టు నుండి భీమిలి మీదుగా భోగాపురం వరకు సముద్ర తీరం వెంబడి అత్యంత అందమైన బీచ్ రోడ్డును బీచ్ కారిడార్‌గా అభివృద్ధి చేస్తున్నారు.

ఉత్తరాంధ్ర జిల్లాల అనుసంధానం

విమానాశ్రయానికి వచ్చే ప్రయాణికులకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం మరియు పార్వతీపురం మన్యం జిల్లాల నుండి రవాణా సౌకర్యాలను కల్పిస్తున్నారు. విశాఖ నుండి ఎయిర్‌పోర్ట్ వరకు

3 లో

పార్వతీపురం పట్టణంలో ప్రచార ర్యాలీ చేస్తున్న పారిశుధ్య కార్మికులు

హలో కార్మికా... చలో విశాఖ

- సిఐటియు బహిరంగసభకు బయలుదేరుతున్న కార్మికలోకం
- సొంతడబ్బులు, ప్రత్యేక వాహనాల్లో పయనం
- పద పద...పద పద కార్మికుడా అంటూ సమరోత్సాహం

హలో కార్మికా... చలో విశాఖ అంటూ విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని కార్మికలోకం ముందుకు కదులుతోంది. పద పద... పద పద కార్మికుడా.. పతాక దళమై కార్మికుండా అంటూ విశాఖ వెళ్లేందుకు సమాయత్తమవుతున్నారు. అందరి చూపు విశాఖవైపే లాగుతోంది. సిఐటియు 18వ అఖిలభారత మహాసభల సందర్భంగా ఈనెల 4న (ఆదివారం) విశాఖలోని ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో జరగనున్న బహిరంగ సభకు పయనమవుతున్నారు.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

డిసెంబర్ 31 నుంచి విశాఖలోని ఎయు కన్వెక్షన్ హాలులో జరుగుతున్న మహాసభలు సమరోత్సాహంతో సాగుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మికవ్యతిరేక విధానాలు, వాటిపై సిఐటియు క్షేత్ర స్థాయిలో చేసిన పోరాటాలు, ఫలితాలు, పోరాట సందర్భాల్లో ప్రభుత్వాల నిర్భంధాలు, బెదిరింపులు, అక్రమకేసులు తదితరాలపై లోతైన చర్చ జరుగుతోంది. ఆదివారం

3 లో

మహిళల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దు

మంత్రి సంధ్యారాణి

అర్బన్‌ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి - సాలూరు

మహిళలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఆహారపు అలవాట్లు, రసాయన ఎరువుల వల్ల కొత్త రోగాలు పుట్టుకొస్తున్నాయని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. ప్రస్తుత కాలంలో మారుతున్న ఆహారపు అలవాట్లు, సాగులో విపరీతంగా వాడుతున్న రసాయన ఎరువుల కారణంగా కేన్సర్ వంటి భయంకరమైన రోగాలు, పేర్లు కూడా తెలియని కొత్త రకమైన వ్యాధులు చుట్టుముడుతున్నాయని, సాలూరులో రూ.99.94లక్షల వ్యయంతో కొత్తగా నిర్మించిన అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి, జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డితో కలిసి పాల్గొన్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఇంటికి మూల స్తంభమైన మహిళ ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబం బాగుంటుందని, కావున ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా వెంటనే ఆసుపత్రికి వెళ్లి తగిన పరీక్షలు చేయించుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రసవ సమయంలో వచ్చే నొప్పులను భరించలేక చాలామంది సిజేరియన్ ఆపరేషన్ల వైపు మొగ్గు చూపుతున్నారని, ఇది భవిష్యత్తులో తీవ్రమైన వెన్నునొప్పి వంటి దీర్ఘకాలిక సమస్యలకు దారితీస్తుందని హెచ్చరించారు. సిజేరియన్లు పెరగడం వల్ల సంతానోత్పత్తి సామర్థ్యం తగ్గిపోతుందని, నార్మల్ డెలివరీల ద్వారా ఎక్కువ మంది పిల్లలు కలిగే అవకాశం ఉంటుందని, తద్వారా జనాభా సమతుల్యతను కాపాడవచ్చని ఆమె అభిప్రాయపడ్డారు. జెసి మాట్లాడుతూ జిల్లాలో ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తూ, గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న నూతన వైద్య భవనాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వెల్లడించారు. ఈ నూతన భవనంలో గర్భిణులకు, చిన్న పిల్లలకు ప్రత్యేక వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని అధికారులు పేర్కొన్నారు. విశాలమైన

3 లో

రైతుల భూ హక్కులకు భరోసా

మంత్రి కొండపల్లి శ్రీనివాస్
రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు పంపిణీ

రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు అందజేస్తున్న మంత్రి శ్రీనివాస్

ప్రజాశక్తి-బొండపల్లి

రీసర్వే పూర్తయిన గ్రామాల్లో రైతులకు ప్రభుత్వ రాజముద్రతో కొత్త పట్టాదారుపాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో అమలు చేస్తోందని రాష్ట్రచిన్న , మధ్య తరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. శనివారం బొండపల్లి మండలం మరువాడలో నిర్వహించిన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. రైతుల భూ హక్కులు స్పష్టంగా నమోదై భవిష్యత్తులో ఎలాంటి వివాదాలకూ తావులేకుండా ఈ విధానాన్ని రూపకల్పన చేశామన్నారు. రైతులు తమ భూమి వివరాలను సులభంగా తెలుసుకునే విధంగా క్యూఆర్ కోడ్ కలిగిన ఆధునిక పాస్‌పుస్తకాలు అందిస్తున్నామన్నారు. భూ రికార్డుల్లో ఏవైనా లోపాలుంటే వాటిని రిజక్టు చేయకుండా సరిదిద్దుకునే అవకాశం ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. జాయింట్ ఎల్‌పిఎం, ఇకెవైసి, బయోమెట్రిక్ ధ్రువీకరణద్వారా వ్యవస్థను మరింత పారదర్శకంగా మార్చామని తెలిపారు. కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి మాట్లాడుతూ భూముల రీ సర్వే పూర్తయిన గ్రామాలకు సంబంధించి లోపాల సవరణతో పాస్‌పుస్తకాలు పంపిణీ చేస్తున్నామన్నారు. గ్రామసభల ద్వారా ప్రజాప్రతినిధులను భాగస్వాములు చేయాలన్నారు. రైతుల నుంచి వచ్చిన అభ్యంతరాలు, మ్యూటేషన్ సమస్యలు, సరిహద్దు వివాదాలు సత్వర పరిష్కారానికి ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేశామన్నారు. తప్పుడు సమాచారంతో పాస్ పుస్తకాలు పొందే ప్రయత్నాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు తమ సమస్యలను సంబంధిత రెవెన్యూఅధికారులను

3 లో

వర్షాన్ని తలపిస్తున్న మంచు

దట్టమైన పొగమంచుతో ఇబ్బందులు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలో ప్రధాన రహదారి సోంపురం జంక్షన్ నుండి వేపాడ మీదుగా ఆనందపురం జంక్షన్‌కు వెళ్లే వరకు శనివారం కురిసిన పొగ మంచుతో ప్రయాణికులు, ప్రజలు ఇబ్బందులు పడ్డారు. రహదారులను కమ్మేసిన మంచుతో లైట్లు వేసినా రహదారి కానరాక ఇబ్బందులు పడ్డారు. ఈ రోడ్డు మార్గంలో ఎక్కువ మలుపులు రోడ్డుకు ఇరువైపులా దట్టమైన పొదలు ఉండటం వల్ల ఎదురెదురుగా వచ్చే వాహనాలు కూడా కనిపించక అవస్థలు పడ్డారు. గ్రామాలు కూడా మంచుతో కప్పేయడంతో కొంతమంది రోగులు ఇబ్బంది పడ్డారు. ఇప్పుడిప్పుడే మామిడి, పెసర పంటకు పూత వస్తున్న తరుణంలో ఈ మంచు రైతులకు అపార నష్టం చేకూర్చే ప్రమాదం ఉంది.

శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

ప్రజాశక్తి - వేపాడ

విద్యార్థులు పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణత సాధించాలని ఎంఇఒ పి.బాలభాస్కరరావు అన్నారు. మండలంలోని బక్కునాయుడుపేట డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం, కస్తూరిబా బాలికల వసతి గృహాలను ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా వంద రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా సాధించిన మార్కులు, వర్క్ బుక్స్ పరిశీలన చేసి సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం డొక్కా మాణిక్యం భోజన వసతి సౌకర్యాలను పరిశీలించారు.

ఉపాధ్యాయుల నియామకానికి దరఖాస్తులు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బక్కునాయుడుపేట ఎపి ఆదర్శ పాఠశాలలో అతిథి ఉపాధ్యాయులు నియామకానికి దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపల్ రావాడ ఈశ్వరరావు తెలిపారు. పాఠశాలలో పిజిటి ఎకనామిక్, అర్థశాస్త్రం, పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. పీజీలో 50 శాతం మార్కులు పొంది ఉండాలని, బిఇడి పూర్తి చేసిన అభ్యర్థులు తమ పూర్తి వివరాలతో పాఠశాలకు జనవరి 4న సాయంత్రం నాలుగు గంటలలోగా సమర్పించాలన్నారు. అభ్యర్థుల అర్హతలను పరిశీలించిన మీదట, వారికి డెమో నిర్వహించి, సెలక్షన్ కమిటీకి అభ్యర్థుల తుది జాబితాను నివేదిస్తామన్నారు. సెలక్షన్ అయినా అభ్యర్థులకు నెలకు రూ.12వేలు గౌరవ వేతనం ఇస్తామన్నారు.

జెడ్‌పి చైర్మన్ పరామర్శ

ప్రజాశక్తి- బాడంగి

మాజీ ఎంపిపి ప్రతినిధి తెంటు మధుసూదన్ తల్లి తెంటు సింహాచలం ఇటీవల మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు శనివారం ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. బాడంగిలో ఏర్పాటు చేసిన సంతాప సమావేశానికి హాజరైన ఆయన, మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. కుటుంబానికి అండగా ఉండి అవసరమైనంత సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. స్థానిక ప్రజాప్రతి నిధులు, గ్రామ పెద్దలు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జిల్లా స్థాయి తైక్వాండోలో సత్తా

ప్రజాశక్తి - బొబ్బిలి

జిల్లా స్థాయి తైక్వాండో పోటీలలో బొబ్బిలి క్రీడాకారులు సత్తా చాటారు. విజయనగరం రాజీవ్ స్టేడియంలో గతనెల 28న జరిగిన జిల్లా స్థాయి పోటీలలో 13మంది క్రీడాకారులు సత్తా చాటడంతో శ్రీకాకుళంలో ఈ నెల 3,4న జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని ఎమ్మెల్యే బేబినాయన శనివారం అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీలలో సత్తా చాటి బొబ్బిలికి మంచి పేరు తేవాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో కోచ్ సుధాకర్, అభ్యుదయ పాఠశాల ప్రిన్సిపాల్ చింతా శారద, క్రీడాకారులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థుల సంసిద్ధతపై ఆరా

ప్రజాశక్తి- మెరకముడిదాం

మండలంలోని ఆదర్శ పాఠశాలను మండల ప్రత్యేకాధికారి డి.మల్లికార్జునరావు శనివారం సందర్శించి పదో తరగతి పరీక్షలకు విద్యార్థుల సంసిద్ధతపై ఆరా తీశారు. వంద రోజుల ప్రణాళికపై చర్చించారు. విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సంపాదించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డివిఎస్ అరుణకుమారి, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రీబాయి పూలే జయంతి

ప్రజాశక్తి - వేపాడ

వల్లంపూడిలో మండల దళిత మహాసభ అధ్యక్షుడు కొమనాపల్లి రాము ఆధ్వర్యంలో చదువుల తల్లి సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వం సమాజంలో ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం జరిపిన ప్రపంచంలోనే తొలి మహిళ సావిత్రిబాయి పూలే అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో గుత్తు శ్రీను, సేనాపతి గణేష్, అప్పారావు, ఆర్ సన్నీ బాబు, ఎం. రమణ, ఎస్ రమణ, రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి బాలసౌరి, ఉమా పాల్గొన్నారు.

మెరకముడిదాం: చిన బంటుపల్లి ఎంపియుపి పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఆల్తి రాంబాబు ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రఘునాథరాజు, అప్పలనాయుడు, ప్రసన్న కుమారి, సూర్యకుమారి, గౌరీశ్వరరావు, కబీర్ పాల్గొన్నారు.

కొత్తవలస: సావిత్రిబాయి వేషధారణలో విద్యార్థి జయశ్రీ

వంగర: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో శనివారం దళిత బహుజన సంఘాల జెఎసి ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ ఉత్తర వెల్లి గణేష్ నాయుడు, డివిఎంసి సభ్యులు మజ్జిగ గణపతి, పళ్ళ మురళి, గణపతిరావు, రాంబాబు, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: పుణ్యగిరి వర్కింగ్ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతిని పట్టణంలోని మహాత్మా గాంధీ పార్క్ ఆవరణంలో శనివారం నిర్వహించారు. ముందుగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జి. బాపు నాయుడు, కార్యదర్శి ముగ్గు ధర్మారావు, మోపాడ బోగయ్యనాయుడు, హనుమాన్ శెట్టి నానాజీ, సన్యాసిరావు, బాల నాగుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కొట్టం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం పి.విజయరామ్ కుమార్ చిత్రపటానికి పూలమాలలు వేశారు.

ఎస్‌కోట: పూలే చిత్రపటానికి పూలమాల వేస్తున్న విలేకర్లు

వేపాడ: మండలంలోని బక్కు నాయుడుపేట, ఆదర్శ పాఠశాలలో జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో భాగంగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి ప్రిన్సిపాల్ రావాడ ఈశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థినులు జ్యోతిరావుపూలే, సావిత్రిబాయిపూలే పాత్రల్లో ఏకపాత్రాభినయం చేసి అప్పటి సమాజ పరిస్థితుల గురించి వివరించారు.

కొత్తవలస: మండలంలోని వీరభద్రపురం పాఠశాల హెచ్ఎం జి. వెంకటనాయుడు ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల మహిళా ఉపాధ్యాయురాలు శ్రావణిని సత్కరించారు. పిల్లలు వేసిన పూలే వేషధారణ ఆకట్టుకుంది.

రైతన్నకు రాజముద్రతో భరోసా : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చీపురుపల్లి

రైతు గౌరవాన్ని పునరుద్ధరించిన కూటమి ప్రభుత్వం పట్టాదారు పాసు పుస్తకాలను రాజముద్రతో పంపిణీ చేస్తోందని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకట్రావు అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో కలిసి రైతులకు పట్టాదార పాస్ పుస్తకాల పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ గత సైకో జగన్ ప్రభుత్వం పాస్ పుస్తకాలపై ఒక వ్యక్తి ఫోటోను ముద్రించి రైతుల ఆస్తులపై హక్కులను కాలరాసే ప్రయత్నం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం, వ్యక్తిగత ప్రచారానికి స్వస్తి పలికి, ప్రభుత్వ అధికారిక చిహ్నమైన 'రాజముద్ర'తో పుస్తకాలను అందించి రైతులకు నిజమైన ఆస్తి హక్కును కల్పించిందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు రౌతు కామనాయుడు, గవిడి నాగరాజు, దన్నాన రామచంద్రుడు, ముల్లు రమణ, చీపురుపల్లి తహశీల్దార్ ధర్మరాజు, గరివిడి, మెరకముడిదాం, గుర్ల, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: రాజముద్రతో రైతులకు ఇచ్చిన పాస్ పుస్తకంతో భూ హక్కు కలుగుతుందని తహశీల్దార్ ఐ.కృష్ణలత అన్నారు. మండలంలోని అక్కన్న అగ్రహారం గ్రామంలో రాజముద్రతో రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు శనివారం రెవెన్యూ గ్రామసభలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పట్టాదారు పాస్ పుస్తకాలతో రైతులకు మేలు చేకూరుతుందని అన్నారు. వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. భూ హక్కు పత్రం ద్వారా రైతులకు రుణాలు, పంటలకు విత్తనాలు రాయితీతో ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిటి ఈశ్వరరావు, విఆర్‌ఒలు సింగం ధోర, దుర్గారావు, రైతులు పాల్గొన్నారు.

చీపురుపల్లి: పాస్ పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కళా

వేపాడ: మండలంలోని బల్లంకి సచివాలయం పరిధిలో గల బిటికె రాజపురంలో శనివారం 62 మంది రైతులకు తహశీల్దార్ జె.రాములమ్మ పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. అయితే పంపిణీ చేసిన కొద్ది సేపటికే సర్వర్ పనిచేయకపోవడంతో కొంత మందికి మాత్రమే పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. ప్రభుత్వం రైతులకు మంజూరైన పాస్ పుస్తకాలు సకాలంలో అందజేయాలంటే సచివాలయంలో ఉన్న సర్వర్ సక్రమంగా పనిచేసే విధంగా తగు చర్యలు తీసుకోవాలని గ్రామ పెద్దలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ టి.రామకృష్ణ, గ్రామ రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

మెరకముడిదాం: మండలంలో బాడాం, కొర్లాం, బిల్లలవలస చెల్లాపురం, గ్రామాల్లో రీ సర్వే పూర్తయిన రైతులకు రాజ ముద్రతో పట్టాదారు పాస్ పుస్తకాలను తహశీల్దార్ ఆకుల సులోచనరాణి కూటమి నాయకులతో కలిసి శనివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిటి, ఆర్ఎస్ డిటి, మండల సర్వేయర్, విఆర్‌ఒలు, గ్రామ పెద్దలు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ: పట్టాదారు పాస్ పుస్తకాలు అందజేస్తున్న కర్రోతు

దత్తరాజేరు: మండలంలోని పాచలవలస మధుర గ్రామమైన చెరుకుపల్లిలో ఉన్న రైతులకు ఆర్‌డిఒ రామ్మోహన్ శనివారం పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఇందులో భాగంగా వైసిపి నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షుడు కంది తిరుపతి నాయుడుకు, మండల పార్టీ అధ్యక్షులు చప్ప చంద్రశేఖర్‌కు పాస్ పుస్తకాలను అందించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ హరికిరణ్‌కుమారి, టిడిపి నాయకుడు గుసిడి వేణు, రైతులు పాల్గొన్నారు.

డెంకాడ: మండలంలోని బొడ్డవలసలో పట్టాదారు పాస్ పుస్తకాలను ఎపి మార్కెఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు పంపిణీ చేశారు. అనంతరం పొలం పనిచేస్తున్న రైతుల వద్దకు వెళ్ళి ధాన్యం కొనుగోలు, అమ్మకంపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి పతివాడ అప్పలనారాయణ, తహశీల్దార్ రాజారావు, డిటి ప్రసాద్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రబీ పంటలలో మెళకువలపై శిక్షణ

ప్రజాశక్తి - కొత్తవలస

రబీ పంటలలో చేపట్టవలసిన మెలైన యాజమాన్య పద్ధతులపై ముసిరాం రైతు సేవా కేంద్రం గొల్లలపాలెం గ్రామంలో రైతులకు శనివారం పూర్వ అభ్యాస గుర్తింపు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. సమన్వయకర్త, జిల్లా జల వనరుల కేంద్రం అధికారి కె.భారతి మాట్లాడుతూ జీవన ఎరువులు వాడకం, సేంద్రీయ వ్యవసాయం, బయో పెస్టిసైడ్, భూసారం పెంపుదల, ప్రభుత్వ లక్ష్యాలు గురించి వివరించారు. స్థానిక వ్యవసాయ సంచాలకులు బి.భానులత మాట్లాడుతూ మొక్కజొన్న పంటలో కలుపు నివారణ, గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గాజులరేగ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త కె.తేజేశ్వరరావు, ఎఒ కె.రాం ప్రసాద్, పి.నిర్మల, పి.పద్మ, ఉద్యాన అధికారి, గ్రామ వ్యవసాయ సహాయకులు, పాల్గొన్నారు.

వేపాడ: రబీ పంటలలో చేపట్టవలసిన మెలైన యాజమాన్య పద్ధతులపై బొద్దాం రైతు సేవ కేంద్రం పరిధిలో గల రైతులకు పూర్వ అభ్యాస గుర్తింపు శిక్షణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. కొత్తవలస వ్యవసాయ సహాయ సంచాలకులు బి.భానులత జీవన ఎరువులు వాడకం, సేంద్రీయ వ్యవసాయం, బయో పెస్టిసైడ్, భూసారం పెంపుదల, ప్రభుత్వ లక్ష్యాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఒ పి. నిర్మల, స్వాతి, అభ్యుదయ రైతు వెంకట్రావు, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

104 ఉద్యోగులకు తీరని అన్యాయం

ప్రజాశక్తి - చీపురుపల్లి

వినతులు ప్రదర్శిస్తున్న ఉద్యోగులు

104లో పనిచేస్తున్న ఉద్యోగులకు సంబంధిత యాజమాన్యం తీరని అన్యాయం చేస్తుందని ఉద్యోగ సంఘాలు శనివారం నిరసన కార్యక్రమం చేపట్టాయి. ఇందులో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద ఉద్యోగులు ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు. యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా రోజురోజుకీ సమస్యలు పెరుగుతున్నాయంటూ ఉద్యోగుల ఆందోళన వ్యక్తం చేశారు. పలుమార్లు యాజమాన్యానికి తమ నిరసన తెలియజేసినప్పటికీ కనీసం పట్టించుకోవటం లేదంటూ వాపోయారు. తమ సమస్యలు పరిష్కారం కాకపోతే మరింత ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ప్రధానంగా యాజమాన్యం తగ్గించిన వేతనాలు సవరించి పూర్తి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు ఏ. రామరాజు, కె. గోవిందా, కె. అలేఖ్య, కె. హేమలత తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి సందర్భంగా

జిల్లాస్థాయి నృత్య పోటీలు

ప్రజాశక్తి - పార్వతీపురం

రానున్న సంక్రాంతి పండగను పురష్కరించుకొని జిల్లా యంత్రాంగం ఆధ్వర్యాన మండల, జిల్లాస్థాయిలో నృత్య పోటీలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి తెలిపారు. జిల్లా సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ జిల్లాలోని కళాకారులను ప్రోత్సహించేలా ఈ పోటీలను నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ పోటీల్లో గిరిజన సంస్కృతిని ప్రతిబింబించే నృత్యాలతో పాటు జానపద, శాస్త్రీయ, దేశభక్తి నృత్యాలు, గీతాలకు అనుమతి ఉంటుందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ సినిమా పాటలకు అనుమతి లేదని, అటువంటి ప్రదర్శనలు పరిగణలోకి తీసుకోబడవని స్పష్టం చేవారు. మొదటి విభాగంగాలో 15ఏళ్లలోపు బాలబాలికలు, రెండో విడత 16 ఏళ్లు పైబడిన వారు అర్హులన్నారు. ఈ పోటీల్లో పాల్గొనదల్చిన వారు వెంటనే తమ పేర్లను సంబంధించిత ఎంపిడిఒ కార్యాలయంలో నమోదు చేసుకోవాలన్నారు. మండల స్థాయి పోటీలను ఈనెల 7లోపు పూర్తి చేసి, విజేతల వివరాలను జిల్లా కేంద్రానికి పంపాలని సూచించారు. మండల స్థాయి విజేతలతో జిల్లా విద్యాశాఖ అధికారి పర్యవేక్షణలో జిల్లాస్థాయి పోటీలు నిర్వహించబడతాయని తెలిపారు. జిల్లాస్థాయి విజేతలకు సంక్రాంతి సంబరాల వేదికపై బహుమతులను అందజేస్తామన్నారు. కావున ఆసక్తి గల ప్రతిభావంతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోఎవాలని కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

భోగాపురానికి నేడు తొలి విమానం

(మొదటిపేజీ తరువాయి)

ఎయిర్‌పోర్ట్ ఎక్స్‌ప్రెస్ ద్వారా 45-55 నిమిషాల్లో ప్రయాణించేలా చర్యలు చేపట్టారు. జాతీయ రహదారి-16 నుండి ట్రాఫిక్ సిగ్నల్స్ లేకుండా నేరుగా విమానాశ్రయంలోకి వెళ్లేలా ఫ్లైఓవర్ డిజైన్ చేయించారు. విశాఖ నుండి భీమిలి మీదుగా సముద్ర తీరం వెంబడి 6-లేన్ల రహదారి నిర్మిస్తున్నారు. సుమారు 48 కిలోమీటర్ల బీచ్ ప్రయాణం పర్యాటకులను కూడా ఆహ్లాదపరచనుంది. విజయనగరం నుంచి 25 కిలోమీటర్ల దూరం, 4-లేన్ల విస్తరణ ద్వారా 30 నిమిషాల్లో చేరుకునేలా, అదేవిధంగా శ్రీకాకుళం మరియు పైడిభీమవరం పారిశ్రామిక ప్రాంతాల నుండి నేరుగా ఎన్‌హెచ్-16 కనెక్టివిటీ ఉంది. పార్వతీపురం మన్యం జిల్లా నుంచి బొబ్బిలి మీదుగా ఎన్‌హెచ్-26 ద్వారా మన్యం ప్రాంతానికి లబ్ధి కలుగుతుంది. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల ప్రజలు గతంలో విమానం ఎక్కాలంటే 3 నుండి 4 గంటల ముందు బయలుదేరాల్సి వచ్చేది. భోగాపురం అందుబాటులోకి వస్తే ఆ సమయం సగానికి పైగా తగ్గుతుంది.

ఉత్తరాంధ్రకు ఉపాధి అవకాశాలు

ఈ ప్రాజెక్ట్ వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలమందికి ఉపాధి లభించనుంది. ఎయిర్‌పోర్ట్ నిర్వహణ, గ్రౌండ్ స్టాఫ్, సెక్యూరిటీ, టికెటింగ్ మరియు కార్గో హ్యాండ్లింగ్‌లో సుమారు 5వేలు నుంచి 10వేల మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. పరోక్షంగా క్యాబ్ సర్వీసులు, హోటల్ పరిశ్రమ, టూరిజం గైడ్‌లు, మెయింటెనెన్స్ సర్వీసుల ద్వారా మరో 20వేల మందికి పైగా ఉపాధి లభించే అవకాశముంది.

హలో కార్మికా... చలో విశాఖ

(మొదటిపేజీ తరువాయి)

మధ్యాహ్నానాని కల్లా కొత్త నాయకత్వం కూడా కొలువుదీరనుంది. ఈనేపథ్యంలో విశాఖలో డిసెంబర్ 27 నుంచి జనవరి 2 వరకు జరిగిన కార్మికోత్సవ్, బహిరంగ సభకు మద్ధతుగా గడిచిన రెండు వారాలుగా జిల్లాలో విస్తృతంగా ప్రచారం చేపట్టిన సంగతి తెలిసిందే. కార్మిక ఉత్సవ్‌లో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన కవులు, రచయితలు, కళాకారులు, సాహితీవేత్తలు, సాహితీ ప్రియులు భాగస్వామ్యయ్యారు. వీరిలో చాలా మంది కవులు, రచయితలు శ్రమ అవార్డులు కూడా అందుకున్నారు. మరోవైపు కార్మిక ఉత్సవ్, సిఐటియు అఖిల భారత మహాసభలకు మద్ధతుతుగా సాంస్కృతిక కార్యక్రమాలు, పరిశ్రమలు, కార్యాలయాల వద్ద గేటు మీటింగులు, సభలు, సమావేశాలు, బైకు ర్యాలీలు చేపట్టారు. ఇందుకు సంసిద్ధులైన చాలా మంది బస్సులు, రైళ్లలో ప్రయాణ ఏర్పాటు చేసుకుంటుండగా, మరికొందరు ప్రత్యేకంగా ఏర్పాటుచేసుకున్న బస్సులు, కార్లు, బైకుల వంటి వాహనాల్లో బయలుదేరతున్నారు. గరివిడి ప్రాంతం నుంచి ఆరు బస్సులు, రెండు మ్యాక్సీ కేబ్‌లు బయలుదేరనున్నాయి. చీపురుపల్లి, బొబ్బిలి, పార్వతీపురం, విజయనగరం ప్రాంత కార్మికులు రైళ్లలో ప్రయాణమౌతున్నారు. గజపతినగరం పది మ్యాక్సీ కేబ్‌లు, ఐదు ఆటోలు, విజయనగరం నుంచి మరో ఐదు బస్సులు, నాలుగు వ్యాన్లు కూడా బయలదేరనున్నాయి. కార్మికులంతా సమరోత్సాహంతో ముందుకు సాగుతున్నారు. ఉత్తరాంధ్ర, ఉభయగోదావరి జిల్లాల నుంచి చీమల దండుగా కార్మికులు పాల్గొనేందుకు వీలుగా విశాఖలోని ఇందిరా ప్రియదర్శిని మైదానంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి.

రైతుల భూహక్కులకు భరోసా

(మొదటిపేజీ తరువాయి)

లేదా మండల స్థాయి కార్యాలయాలను సంప్రదించాలని సూచించారు. అనంతరం రైతులకు మంత్రి, కలెక్టర్ పాస్‌పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ డి.కీర్తి, ఎంపిపి చల్లంనాయుడు, సర్పంచులు డి.పార్వతి, బి.రాము,శ్రీనివాస్, ఈ.కృష్ణ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దు

(మొదటిపేజీ తరువాయి)

గదులతో పాటు అత్యాధునిక ప్రయోగశాల సదుపాయం కల్పించబడిందని, ఇక్కడ అన్ని రకాల రక్త పరీక్షలతో పాటు ఇతర వైద్య పరీక్షలు కూడా నిర్వహిస్తారన్నారు. చిన్నారులకు వేయాల్సిన అన్ని రకాల టీకాలు ఇక్కడ లభిస్తాయన్నారు. ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎస్.భాస్కరరావు, ప్రోగ్రాం ఆఫీసర్ శివకుమార్, మున్సిపల్ డిఇ ప్రసాదరావు, ఎఎంసి ముఖీ సూర్యనారాయణ, పట్టణ టిడిపి అధ్యక్షులు నిమ్మాది తిరుపతి రావు, మెడికల్ ఆఫీసర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో, క్యాబ్ డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎంవిఐ ప్రసాద్

రహదారి భద్రతతోనే ప్రాణాలకు రక్షణ : ఎంవిఐ

ప్రజాశక్తి - సాలూరు

వాహన చోదకులు రహదారి నిబంధనలు పాటిస్తూ క్రమశిక్షణతో వాహనాలు నడిపినప్పుడే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చునని సాలూరు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ జెవివివిఎస్ ప్రసాద్ పేర్కొన్నారు. జిల్లా రవాణా శాఖ అధికారి ఆదేశాల ప్రకారం జనవరి 1 నుండి 31 వరకు నిర్వహించనున్న 'రహదారి భద్రతా మాసోత్సవాలు - 2026' కార్యక్రమంలో భాగంగా శనివారం సాలూరులో ఆటో, మ్యాక్సీక్యాబ్ డ్రైవర్లకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది శిక్షణతో భద్రత, సాంకేతికత ద్వారా పరివర్తన అన్న నినాదంతో ఈ మాసోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వాహనదారులు అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, డ్రైవింగ్ చేసేటప్పుడు సెల్ ఫోన్ మాట్లాడడం వంటివి చేయరాదని సూచించారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, అటువంటి చర్యలకు పాల్పడవద్దని హెచ్చరించారు. రహదారి భద్రత అనేది కేవలం ఒక నెల రోజులు పాటించేది కాదని, ప్రతిరోజూ దీన్ని ఒక బాధ్యతగా గుర్తుంచుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రవాణా శాఖ సిబ్బంది, ఆటో, మ్యాక్సీక్యాబ్ డ్రైవర్లు పాల్గొన్నారు.

స్వచ్ఛ రథం నిర్వహణకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలోని పార్వతీపురం, సాలూరు, గుమ్మలక్ష్మీపురం మండలాల్లో ఒక్కో మండలానికి ఒక్కొక్క యూనిట్‌గా స్వచ్ఛరథం నిర్వహణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వచ్ఛరథం నిర్వహణకు అర్హులైన వ్యక్తులు, సంస్థలు, స్క్రాప్‌డీలర్లు, ఆపరేటర్లు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. గరిష్టంగా గ్యాప్ ఫండింగ్ మోడల్ 1కి రూ. 25 వేలు చెల్లిస్తామన్నారు. స్క్రాప్ డీలింగ్, ఘన వ్యర్థాల సేకరణ, పునర్వినియోగపర్చదగిన పదార్థాల నిర్వహణలో కనీసం మూడేళ్ల అనుభవం ఉండి, ట్రేడ్ లైసెన్స్,రిజిస్ట్రేషన్ ఉండాలని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తుతో పాటు ఆధార్, పాన్, నివాస లేదా సంస్థ రిజిస్ట్రేషన్, అనుభవ ధ్రువీకరణ, సహాయక పత్రాలు, స్క్రాప్ డీలింగ్, ఎంఆర్ఎఫ్ ఆపరేషన్ కొరకు ట్రేడ్ లైసెన్స్, జిఎస్టి రిజిస్ట్రేషన్ (ఉంటే), మూడేళ్ల టర్నోవర్ స్టేట్మెంట్, ఐటి రిటర్న్స్, స్వచ్ఛరథం కోసం ప్రతిపాదించబడిన వాహనం వివరాలు, బ్యాంకు పాస్ పుస్తకం, ఉమ్మడి ఆపరేషన్ వివరాలు, అధికారుల నుంచి నెలకు వయోబిలిటీ గ్యాప్ ఫండింగ్ పొందడానికి బిడ్డర్ కోట్ చేసిన మొత్తం సీలింగ్, పరిమితి మోడల్ రూ.25వేలు, పాస్పోర్ట్ సైజ్ ఫోటో, దరఖాస్తుదారుని పూర్తి చిరునామా, ఫోన్ నెంబర్, దరఖాస్తుదారుడు రూ. 10వేలు(తిరిగి చెల్లింపబడని) డిడి తీసి ఎంపిడిఓ చిరునామాతో దరఖాస్తుతో సమర్పించాలని వివరించారు. దరఖాస్తులు ఈ ప్రకటన వెలువడిన వారం రోజుల్లో సమర్పించాలని కోరారు.

చలో విశాఖను జయప్రదం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి - వీరఘట్టం

విశాఖలో జరిగే అఖిల భారత సిఐటియు మహాసభలు సందర్భంగా ఆదివారం తలపెట్టిన భారీ బహిరంగసభ, ర్యాలీకి అధిక సంఖ్యలో ప్రజలు తరలి రావాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిర పిలుపునిచ్చారు. బహిరంగసభను జయప్రదం చేయాలని కోరుతూ వీరఘట్టం, నడుకూరులో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా కార్పొరేట్లకు కొమ్ముకాసి కార్మిక ఉద్యమాలను అణచివేసే కుట్రలు చేపడుతున్నాయని విమర్శించారు. ధరలు ఆకాశాన్ని తాకుతుంటే కార్మికవేత్తనాలు పాతాళానికి చేరుతున్నాయని, అయితే అంబానీ, ఆదానీల ఆస్తులు 100 రెట్లు అమాంతంగా పెరుగుతున్నాయని అన్నారు. కావున లేబర్ కోడ్స్ రద్దు అయ్యేంత వరకూ సిఐటియు పోరాడనుందని తెలిపారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌తో సహా అన్ని ప్రభుత్వరంగ పరిశ్రమలను మూసివేసే కుట్రలు పన్నుతున్నాయని, పెన్షన్ను నామామాత్రం చేస్తున్నాయని, లేబర్ కోడ్స్ పేరుతో బ్రిటీష్ కాలం నాటి నుంచి సాధించుకున్న హక్కులను తొలగిస్తున్నాయని విమర్శించారు. ఈ నేపథ్యంలో ఆదివారం విశాఖపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద మధ్యాహ్నం 2 గంటలకు మహా ప్రదర్శన ప్రారంభమై, మున్సిపల్ స్టేడియం వద్ద బహిరంగ సభ జరగనుందని దీనికి కార్మికులంతా హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎన్.ప్రసాదరావు, సిహెచ్.నాగలక్ష్మి, వై.ప్రసాద్, పి.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రాజాం వెళ్లి వస్తానని మృత్యు ఒడికి

ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొని యువకుడు మృతి

ప్రజాశక్తి- రేగిడి, రాజాం

మండలంలోని ఉణుకూరు గ్రామానికి చెదంఇన కంటు గణేష్(38) రాజాంలో దుకాణానికి సరుకులు తెచ్చి వస్తానని భార్యతో చెప్పి ద్విచక్ర వాహనంపై శనివారం వెళ్లాడు. పాలకొండ రాజాం ప్రధాన రహదారి జెజెఇన్‌టెల్ హోటల్ సమీపంలో లారీ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108 ద్వారా రాజాం ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడ వైద్య పరీక్షలు చేసి అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడు గణేష్ గత కొన్నేళ్లుగా చర్లపల్లిలో కుటుంబ సభ్యులతో కలిసి జీవనం సాగించేవాడు. అక్కడ లాభసాటి లేక స్వగ్రామానికి కుటుంబ సభ్యుతో వచ్చేశారు. గత మూడేళ్లుగా బతుకుతెరువు కోసం ఒప్పంగి సెంటర్ వద్ద చిన్న దుకాణం పెట్టారు. జీవనం బాగా జరుగుతుందన్న సమయంలో ఇలా మృత్యువాత పడటం కుటుంబ సభ్యులు రోధన మిన్నంటింది. మృతునికి భార్య కళావతితో పాటు త్రిషాల్, అర్షిత పిల్లలున్నారు. పేద కుటుంబం కావడంతో ప్రభుత్వం తమను ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. రాజాం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కూలి డబ్బులు అడిగిందని ఆత్మహత్య

ప్రజాశక్తి- సంతకవిటి

మండల కేంద్రానికి చెందిన బోగి కనకరాజు(28) మృతి చెందిన ఘటనపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. కూలి డబ్బులు విషయమై మృతుడు, అతని తల్లి మద్య వాగ్వివాదం జరిగింది. ఈ నేపథ్యంలో మనస్థాపానికి గురైన కనకరాజు గడ్డిమందు తాగి అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు అతడిని మెరుగైన చికిత్స నిమిత్తం శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై ఎస్ఐ ఆర్ గోపాలరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భారీగా పిడిఎస్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని బొప్పడాంలో పిడిఎస్ బియ్యాన్ని పోలీసులు శనివారం పట్టుకున్నారు. ఎస్ఐ బి.గణేష్ వివరాలు ప్రకారం.. బొప్పడాంలో అక్రమంగా పీడీఎస్ రైసును తరలిస్తున్న బొలెరో వ్యాన్‌ను స్పెషల్ టాస్క్‌ఫోర్స్ టీమ్ సహాయంతో పట్టుకున్నామన్నారు. 3వేల కేజీలు రైస్‌తో వాహనాన్ని స్వాధీనం చేసుకొని డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అక్రమంగా పిడిఎస్ రైసును తరలించడం నేరమని ఇకపై ఎవరైనా ఇలాంటి నేరాలు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వ్యాన్‌తో పిడిఎస్ బియ్యాన్ని పట్టుకున్న ఎస్ఐ గణేష్, సిబ్బంది

ప్రకటన

మహారాజశ్రీ అమలాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి వారి కోర్టులో(జూనియర్ డివిజన్)

O.S.No.335/2024

Between:-

మట్ట సుబ్రహ్మణ్యం ...వాది

అండ్

2. బుజేటి నరసింహ రెడ్డి & అదర్స్ S/o. ఓబుల్ రెడ్డి వ.74, పార్వతీపురం(మ) విజయనగరంజిల్లా ...ప్రతివాదులు

పై నెంబర్ కేసును వాది, దావా తాలూకు షెడ్యూల్ ఆస్తి డిక్లరేషన్ నిమిత్తం దావావేసినారు. మీరు 2వ ప్రతివాది అయి ఉన్నారు మీకు ఎన్నిసార్లు దావసమన్లు పంపినప్పటికీ మీరు సమన్లు తీసుకోనందున శ్రీకోర్టు వారు న్యూస్‌పేపరు ప్రకటన ద్వారా మీకు తెలియపరచమని ఆదేశాలు జారి చేసినారు. కాబట్టి వాయిదా **ది.19-01-2026** వ తేదికి ఉన్నది. కాబట్టి వాయిదాకి మీరు స్వయంగా లేదా న్యాయవాది ద్వారా ఉదయం **గం॥10.00లకు** హాజరు అయ్యి సంజాయషి యిచ్చుకోవలెను లేనియడల శ్రీ కోర్టు వారు మీ పరోక్షమున తీర్మానము చేయుదురు.

(బై ఆర్డర్ ఆఫ్ ది కోర్ట్)

వీరిన సాయి

అడ్వకేట్, అమలాపురం

సెల్.9848615771

ఎయిర్‌పోర్టుపై ఉన్న శ్రద్ధ నిర్వాసితులపై ఏదీ?

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

భోగాపురం గ్రీన్ ఫీల్డ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో ఈనెల 4న తొలిసారిగా విమానం ల్యాండ్ కానుంది. ఈ మేరకు ఇప్పటికే విమానాశ్రయ నిర్మాణ సంస్థ, ఇటు ప్రభుత్వం ప్రకటించాయి. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు కూడా చకచకా ముందుకు సాగుతున్నాయి. పాలకులు చెబుతున్నట్టు ఇది చారిత్రాత్మకమే. కానీ, ఈ చరిత్ర వెనుక నిర్వాసితులు సమిధలయ్యారు. భూములు కోల్పోయిన వారు కొందరు, ఇళ్లు భూములు కోల్పోయిన వారు మరికొందరు. వ్యవసాయ పనులు, ఈ ప్రాంతంలోని ఇతర వృత్తులపై ఆధారపడిన కూలీలు, వృత్తిదారులకు పూర్తిగా జీవనాధారం లేకుండా పోయింది. కానీ, విమానాశ్రయాన్ని అభివృద్ధిగా చెబుతున్నారు పాలకులు. అభివృద్ధికి విలువైన భూములు, పుట్టి పెరిగిన ఊళ్ళు త్యాగం చేసిన వారు ఇదేమి అభివృద్ధి అని ప్రశ్నిస్తున్నారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలోని ప్రజానీకం కూడా ప్రభుత్వ ప్రచారాన్ని తప్పుపడుతూ, నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరుతున్నారు. విమానాశ్రయంపై ఉన్న శ్రద్ధ అందుకు సహకరించిన రైతులు ఇతర ప్రజానికంపై లేదా అంటూ చర్చించుకుంటున్నారు. ఎయిర్‌పోర్టు కోసం భోగాపురం మండలం సవరవిల్లి, అమటాం, రాయివలస, గూడెపువలస, రెడ్డి కంచేరు, కవులవాడ రెవెన్యూ గ్రామాల పరిధిలో 2,700 ఎకరాలను ప్రభుత్వం సేకరించింది. దీంతో, బొల్లెంకులపాలెం, ముడసర్లపేట, మరడపాలెం, రెల్లిపేట గ్రామాలు పూర్తిగా కనుమరుగయ్యాయి. రెండుచోట్ల ఆర్ అండ్ ఆర్ కాలనీలు ఏర్పాటు చేసినప్పటికీ, ఆయా ప్రదేశాలు ఇప్పటికీ 22-ఎలో ఉండడంతో ఆ ఇళ్లపై నిర్వాసితులకు పూర్తి స్థాయిలో హక్కు లేకుండాపోయింది. ఎయిర్‌పోర్టు జాతీయ రహదారిని కలుపుతూ ఏర్పాటు చేసిన రోడ్డు నిర్మాణానికి సుమారు 210 ఎకరాలను ప్రత్యేకంగా 2019 నోటిఫికేషన్ ద్వారా గుర్తించారు. ఇందులో 25 ఎకరాలు మినహా మిగిలిన భూమంతా జిరాయితీయే. ఎక్కువ మంది రైతులు పరిహారం భూములిచ్చేందుకు నిరాకరించినప్పటికీ అప్పటి ఆర్‌డిఒ భవానీ శంకర్ 109 మందికి చెందిన 39 ఎకరాల భూమిని బలవంతంగా లాగేసుకునేందుకు ఎఫ్‌సిఒ రికార్డులు ఆధారంగా రూ.19

కోట్ల అవార్డును పాస్ చేశారు. అనుభవంలో ఉన్నవారి పేర్లు, ఎఫ్‌సిఒ రికార్డు సరిపోదంటూ చెల్లింపునకు పిఎఫ్‌ఎంఎస్ నిరాకరించింది. దీంతో, ఆ తర్వాత వచ్చిన ఆర్‌డిఒ సూర్యకళ రైతుల పేరిట మంజూరై ఉన్న మొత్తం డబ్బులను ఎల్ఎఆర్‌ఆర్ఎ (ల్యాండ్ అక్విజేషన్ రీహేబిటేషన్ రీసెటిల్మెంట్ అథారిటీ)లో జమ చేసి అక్కడితో తన పని అయిపోయినట్టు వ్యవహరించారు. గూడెపువలసకు చెందిన 15 మంది రైతులు కొన్ని రకాల సర్టిఫికెట్లు చూపించి, సాంకేతిక సమస్యలను అధిగమించి సుమారు రూ.7 కోట్ల వరకు పొందగలిగారు. మిగిలిన రూ.12 కోట్లు ఇప్పటికీ ఆథారిటీ వద్దే ఉండిపోయాయి. దీంతో, గూడెపువలసలోని మరికొందరితోపాటు సవరవల్లి, ఎ.రాయివలస, బైరెడ్డిపాలెం, రెడ్డిక కంచేరు గ్రామాల నిర్వాసితులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఎయిర్‌పోర్టుకు వచ్చిపోయే వాహనాల ట్రాఫిక్ సమస్య నియంత్రణకు ట్రంపెడ్ నిర్మాణానికి సవరవల్లి పంచాయతీ ఉప్పాడపేటకు చెందిన రైతుల నుంచి 2021 నోటిఫికేషన్ ద్వారా పది ఎకరాలు, ఎన్‌హెచ్ ఆథారిటీ నుంచి రెండు ఎకరాలు కలిసి మొత్తం 12 ఎకరాలను ప్రభుత్వం తీసుకుంది. నిర్వాసిత రైతులకు రూ.6 కోట్లు, ఎన్‌హెచ్ అథారిటీకి రూ.5 కోట్లు చొప్పున మొత్తం రూ.11 కోట్ల వరకు నేటికీ చెల్లించలేదు. దీంతోపాటు నాన్ అగ్రికల్చర్ ల్యాండ్‌ను వ్యవసాయ భూమిగా గుర్తించడం వల్ల తమకు నష్టపరిహారం తక్కువగా వచ్చిందంటూ ఓ సంస్థ భూమి ఇచ్చేందుకు నిరాకరించింది. దీంతో, నాన్ ఆగ్రికల్చర్ ల్యాండ్‌గా గుర్తిస్తామంటూ అప్పట్లో ప్రభుత్వ పెద్దలు నచ్చజెప్పి భూమి తీసుకున్నప్పటికీ, అందుకనుగుణంగా పరిహారం ఇవ్వలేదు. దీని విలువ కూడా సుమారు రూ.కోటిన్నర వరకు ఉంటుందని అంచనా. ఎయిర్‌పోర్టు గోడ నిర్మాణం వల్ల చాలా గ్రామాలకు, శ్మశానవాటి కలకు రహదారుల కనెక్టవిటీలు దెబ్బతిన్నాయి. పలుచోట్ల ఎయిర్‌పోర్టు నిర్మాణ సంస్థ (జిఎంఆర్) రోడ్డుకు ఇరువైపులా కంచె వేయడంతో రైతులు తమ భూములకు వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించకోగా, ఎయిర్‌పోర్టు రహదారిని పరిమితికి మించిన ఎత్తులో నిర్మించడం వల్ల కూడా సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని నిర్వాసితులు వాపోతున్నారు. ఈ సమస్యలు, నష్టపరిహారం చెల్లింపు, ఆర్ అండ్ ఆర్ కాలనీని 22-ఎ నుంచి తొలగించడం వంటి వాటిపై ప్రభుత్వానికి పట్టడం లేదని, కేవలం ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులపైనే దృష్టి పెట్టిందని నిర్వాసితులు, ప్రభావిత గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు. పైగా, ఐటి హబ్, అర్బన్ డెవలప్‌మెంట్ పేరిట వేలాది ఎకరాలు లాగేసుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుండడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

రైతులకు సరిపడా యూరియా సిద్ధం

ప్రజాశక్తి - జామి

మండలంలోని 8 టన్నుల వరకు యూరియా సిద్ధంగా ఉందని వ్యవసాయ అధికారి ఎం. పూర్ణిమ అన్నారు. శనివారం జామి, అన్నంరాజుపేట రైతులకు 15 మెట్రిక్ టన్నులు యూరియా 1బి, ఆధార్ పరిశీలించి, బయోమెట్రిక్ విధానంలో ఆమె సమక్షంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మొక్కజొన్న, వరి, వేరుశెనగ వంటి రబీలో వేసుకొన్న పంటలకు సరిపడా యూరియా ఉందన్నారు. రబీలో పంటలు వేసిన ప్రతీ రైతు తమ పంటలను ఇపంటలో నమోదు చేసుకోవాలి అని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ అహ్మద్, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

మున్సిపల్ అభివృద్ధికి ప్రాధాన్యత

ప్రజాశక్తి - బొబ్బిలి

మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్ బాబు అన్నారు. స్థానిక మున్సిపాలిటీలోని పదో వార్డు అంబేద్కర్ కాలనీలో రూ. 5లక్షలతో సీసీ రోడ్డు, రాణి మల్లమ్మ దేవి పార్కు చెరువు గట్టుపై రెండు చోట్ల రిటైనింగ్ వాల్ నిర్మాణానికి రూ.5లక్షలు, చెరువు గట్టుపై కల్వర్ట నిర్మాణానికి రూ. 5లక్షలు, స్వామివారి వీధిలో రూ.2 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. అన్నీ వార్డులలో అభివృద్ధి పనులు చేపడతామని శరత్ అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

సావిత్రీభాయి వేషధారణతో విద్యార్థుల నివాళి

సావిత్రీబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలి

ప్రజాశక్తి-విజయనగరం కోట

సావిత్రిబాయి పూలేను ప్రతి మహిళ ఆదర్శంగా తీసుకోవాలని గాజుల రేగ నారాయణ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ మొయిద నారాయణరావు అన్నారు. శనివారం మహిళా ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా నారాయణ పబ్లిక్ స్కూల్లో ముందుగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు అనంతరం విద్యార్థులు సావిత్రిబాయి పూలే వేషధారణతో ఆకట్టుకున్నారు ఈ సందర్భంగా కరస్పాండెంట్ నారాయణరావు మాట్లాడారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చదువుల తల్లి సావిత్రిబాయి పూలే

విజయనగరం టౌన్ : జిల్లా బిసి,ఎస్‌సి,ఎస్‌టి మైనారిటీ కులాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఐక్యవేదిక నాయకులు చోడి ఆదినారాయణ, లాయర్ కరీం, రొంగలి రామారావు, ఇప్పిలి రామారావు మాట్లాడుతూ, ఆనాటి సమాజం ఎదుర్కొంటున్న సామాజిక వివక్ష, పేదరికం, అంటరానితనంపై మహాత్మ జ్యోతిరావు పూలే అనేక పోరాటాలు చేశారని అన్నారు. దేశంలోనే తొలి మహిళా ఉపాధ్యాయరాలిగా . సావిత్రిబాయి పూలే అనేకమంది ఉత్తమ విద్యార్థులను తయారు చేసి సమాజానికి అందించారని అన్నారు. కార్యక్రమంలో కిల్లంపల్లి ఆచారి, చెల్కి లక్ష్మణరావు, ఎస్ తారకేశ్వరరావు, ఎస్.ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ : భోగాపురం, పూసపాటిరేగ, డెంకాడ మండలాల్లో సావిత్రీబాయి పూలే జయంతి కార్యక్రమాలు యుటిఎఫ్, జెవివి సమతా విభాగం ఆధ్వర్యాన జరిగాయి. భోగాపురం జెడ్‌పి ఉన్నతపాఠశాలలో పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. ఆదర్శ డిగ్రీ కాలేజీలో సమత రాష్ట్ర కన్వీనర్ జి.నిర్మల, జెవివి నాయకులు మోహన్‌రావు, మాట్లాడారు. కార్యక్రమంలో సుశీల, కుసుమకుమారి, ప్రిన్సిపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సమతా కన్వీనర్ జి.నిర్మల

మాదకద్రవ్యాలతో జీవితం నాశనం చేసుకోవద్దు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మాదక ద్రవ్యాలకు బానిసై, తమ నిండైన జీవితాన్ని ఎవరూ నాశనం చేసుకోవద్దని ఎఎస్‌పి మనీషా రెడ్డి అన్నారు. అభ్యుదయం సైకిల్ యాత్ర ముగింపు కార్యక్రమంలో భాగంగా, శనివారం పార్వతీపురం, పాలకొండ సబ్- డివిజన్ పరిధిలో 3 కె రన్ కార్యక్రమం జరిగింది. ఎఎస్‌పి ఆధ్వర్యాన పోలీస్ అధికారులు, సిబ్బంది, విద్యార్థులతో కలిసి 3కె రన్ నిర్వహించారు. ఎస్‌విడి కళాశాల ప్రాంగణం నుంచి ప్రారంభించి ప్రధాన రహదారి గుండా ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి వద్ద మానవహారం ఏర్పడి డ్రగ్స్ వద్దు బ్రో అంటూ డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ బెలగాం లో ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం వరకు సాగింది. అనంతరం ఎఎస్‌పి మనీషారెడ్డి విద్యార్థులను ఉద్దేశిస్తూ మాట్లాడుతూ మత్తుపదార్థాలు ఒకసారి స్వీకరిస్తే క్రమేపి వాటికి బానిసయిపోతారని, అలా బానిసవ్వకుండా యువతను సన్మార్గంలో నడిపించేలా, మీలో శక్తిని మేల్కొలిపి క్రీడలవైపు ప్రోత్సహించేలా చేయడమే ఈ రన్ ఉద్దేశమని అన్నారు. గంజాయి, ఇతర అసాంఘిక కార్యక్రమాల గురించి సమాచారం తెలిస్తే వెంటనే 1972కు, 100/112కు లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అనంతరం డ్రగ్స్ వద్దు బ్రో అనే నినాదాలు చేస్తూ, అందరితో డ్రగ్స్ కి వ్యతిరేఖంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎఆర్ డిఎస్పీ థామస్ రెడ్డి, పట్టణ సిఐ వెంకటరావు, సాలూరు పట్టణ సిఐ అప్పలనాయుడు, ఆర్ఐ లు నాయుడు, రాంబాబు, పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న పార్వతీపురం ఎఎస్‌పి మనీషారెడ్డి

గుమ్మలక్ష్మీపురం : ఎల్విన్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో పాలకొండ డిఎస్పీ రాంబాబు ఆధ్వర్యంలో పోలీస్ అధికారులు, సిబ్బంది, ప్రజలు, విద్యార్థులతో కలిసి 3కె రన్ నిర్వహించారు. అనంతరం ఎస్‌కె పాడులో ఏర్పాటు చేసిన అవగాహనా కార్యక్రమంలో డిఎస్పీ రాంబాబు మాట్లాడారు. పోలీస్ అధికారులు, సిబ్బంది ప్రజలు, విద్యార్థులు కలిసి సుమారు 1500 మంది అవగాహనా కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో చినమేరంగి, ఎల్విన్‌పేట సిఐలు తిరుపతిరావు, ఎల్విన్ పేట సిఐ హరి, ఎస్ఐలు బిడ్డిక శివ ప్రసాద్, నారాయణ రావు, నీలకంఠేశ్వరరావు తదితరులు ఉన్నారు.

బొబ్బిలి : మత్తుకు అలవాటు పడితే జీవితాలు చిత్తు అవుతాయని డిఎస్‌పి భవ్యరెడ్డి అన్నారు. జిల్లాలో పోలీసులు చేపట్టిన అభ్యుదయం సైకిల్ ర్యాలీ ముగింపు సందర్భంగా శనివారం పట్టణంలో 3కె వాక్ నిర్వహించారు. రాజా కళాశాల వద్ద వాక్ ప్రారంభించి ఎన్టీఆర్ బొమ్మ, కోట జంక్షన్, వాటర్ ట్యాంక్, కోర్టు జంక్షన్, ఆర్‌టిసి కాంప్లెక్స్ మీదుగా రాజా కళాశాల వరకు చేపట్టారు. కార్యక్రమంలో రోటరీ, కారుణ్య సంస్థల చైర్మన్ జెసి రాజు, కారుణ్య కార్యదర్శి ప్రవీణ్ కుమార్, గ్రీన్ బెల్ట్ అధ్యక్షులు రమణమూర్తి, మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షులు రెవల్ల కిరణ్‌కుమార్, బొబ్బిలి, రామభద్రపురం, బాడంగి, తెర్లాం, పోలీస్ స్టేషన్‌ల ఎస్ఐలు రమేష్, ప్రసాద్, తారకేశ్వరరావు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తవలస: డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేయడంతో పాటు మాదక ద్రవ్యాలను అరికడదామని సిఐ షణ్ముఖరావు అన్నారు. మండల కేంద్రంలో సుమారు మూడు కిలోమీటర్ల వరకు స్కూల్ పిల్లలు, డిఫెన్స్ అకాడమీ పిల్లలతో డ్రగ్స్‌కు, గంజాయికు వ్యతిరేకంగా ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐలు జోగారావు, ప్రసాద్ రావు, పోలీస్ సిబ్బంది పాల్గొని మాదకద్రవ్యాలకు, మత్తు పదార్థాలకు బానిస కావద్దని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

రాజాం: స్థానిక పోలీసుల ఆధ్వర్యంల 3కెఎం 'వాక్ థాన్' కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని అమ్మవారి గుడి నుంచి జి.ఎం.ఆర్.ఐటి వరకు వాక్ థాన్ చేశారు. ఈ సందర్భంగా చీపురుపల్లి డిఎస్‌పి రాఘవులు మాట్లాడుతూ గంజాయి, ఇతర మత్తు పదార్థాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో చీపురుపల్లి సబ్ డివిజన్ సిఐలు, ఎస్ఐలు పోలీసు సిబ్బంది, ఎన్‌సిసి క్యాండిడేట్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆత్మ రక్షణ మెళకువలను నేర్చుకోవాలి : ఎస్‌పి

ప్రజాశక్తి -కంటోన్మెంట్

ప్రతీ మహిళ ఇతరులపై ఆధారపడకుండా తమ స్వశక్తితో రక్షించుకొనేందుకు ఆత్మరక్షణ మెళుకువలను నేర్చుకోవాలని ఎస్‌పి ఎఆర్ దామోదర్ పిలుపునిచ్చారు. పోలీసు పరేడ్ గ్రౌండులో మహిళ ఫుట్ బాల్ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు నాంధీ ఫౌండేషను ఆధ్వర్యంలో నిర్వహించిన ఫుట్‌బాల్ టోర్నమెంటును ఎస్‌పి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ స్థాయిలో మహిళా ఫుట్‌బాల్ క్రీడాకారులను వెలికితీసేందుకు ఇటువంటి పోటీలు దోహదపడతాయని అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నప్పటికీ కొన్ని సందర్భాల్లో వివక్షకు గురవుతున్నారన్నారు. వీటిని అధిగమించడానికి మహిళలు మరింత చైతన్యవంతులై, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించుకొని, వివక్షను తిప్పి కొట్టాలన్నారు. మహిళలపై వేధింపులకు, దాడులకు అఘాయిత్యాలకు పాల్పడేవారిపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికి వారి చర్యలను ఎదుర్కొనే తెగింపు ప్రతీ మహిళలో ఉండాలన్నారు. ఇందుకోసం ప్రతీ ఒక్క మహిళ తమ విద్యార్ధి దశ నుండే కొన్ని ఆత్మ రక్షణ టెక్నిక్స్ ను స్వఛ్ఛందంగా నేర్చుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు భద్రత, రక్షణ కల్పించేందుకు శక్తి యాప్ ను ప్రత్యేకంగా రూపొందించిందన్నారు. ఈ యాప్‌ను ప్రతి ఒక్కరూ తమ మొబైల్ ఫోనులో నిక్షిప్తం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, విజయనగరం ఇన్‌ఛార్జి డిఎస్‌పి ఆర్.గోవిందరావు, డిఎస్‌పి అంబేద్కర్, డిఎస్‌డిఒ వివిఎస్ రమణ, సిఐలు , మహిళా క్రీడాకారులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎస్‌పి దామోదర్

డిపో వద్ద మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న కార్మికులు (ఫైల్)

ఏదో ఉన్న ఊళ్లో కాస్తా కూస్తో డబ్బులు తెచ్చుకుని బతుకుతున్న హమాలీలకు ప్రభుత్వ షాక్ నిచ్చింది. ఎచ్చెర్లలోని ఇండియన్ మేడ్ లిక్కర్ (ఐఎంఎల్) డిపోను విడదీసి టెక్కలిలో కొత్తగా డిపో ఏర్పాటు చేస్తూ గతేడాది జూలై ఎనిమిదో తేదీన ఇచ్చిన సర్క్యులర్ వారికి శరాఘాతంగా మారింది. ప్రభుత్వ నిర్ణయంపై కార్మికులు తీవ్రంగా రగిలిపోయారు. తమ ఉపాధికి గండికొడుతున్న ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. ఎపి స్టేట్ బెవరేజస్ కార్పొరేషన్ లిమిటెడ్ లోడ్ అండ్ అన్ లోడింగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన కార్మికులు ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా వివిధ రూపాల్లో ఆందోళన సాగించారు.

ఐఎంఎల్ కార్మికుల అలుపెరగని పోరు

ఎచ్చెర్ల డిపోను విడదీస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు

వివిధ రూపాల్లో ఆందోళనలు చేపట్టిన హమాలీలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లలో 1986లో అప్పటి ప్రభుత్వం దళితులకు చెందిన భూముల్లో యారక్ బాటిలింగ్ యూనిట్ ఏర్పాటు చేసింది. తమకు ఉపాధి దొరకుతుందని భావించి దాదాపు వంద దళిత కుటుంబాలు నాలుగు ఎకరాల భూమిని ప్రభుత్వానికి అప్పగించాయి. ఇందులో లోడింగ్, అన్‌లోడింగ్ పనులు చేసుకునేందుకు రోజువారి కూలీ ప్రాతిపదికన 80 మందికి పనికల్పించారు. అప్పటి నుంచి ఆ కుటుంబాలు దీనిపై ఆధారపడి బతుకుతున్నాయి. అప్పట్లో సారా తయారీ కేంద్రంగా ఉన్న ఆ కేంద్రం క్రమేణా ఎపి బెవరేజస్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యాన ఐఎంఎల్ డిపోగా రూపాంతరం చెందింది. ప్రస్తుతం దానినే విడగొట్టి టెక్కలిలో డిపో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఒక సర్క్యులర్‌ను జారీ చేసింది. ప్రభుత్వ సొంత గోడౌన్ ఉండగా అదనంగా అద్దె చెల్లించి టెక్కలిలో ఏర్పాటు చేయాల్సిన అవసరం ఏమొచ్చిందంటూ కార్మికులు ఆందోళనలకు దిగారు. ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో ఆందోళనలను ఉధృతం చేశారు. డిపో ఎదుటే మోకాళ్లతో, పొర్లు దండాలతో నిరసనలు తెలిపారు. వామపక్షాల ఆధ్వర్యాన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించి డిపో తరలింపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడంతో కలెక్టరేట్ వద్ద కుటుంబాలతో నిరసన తెలిపారు.

డిపో తరలింపులో అధికార పార్టీ నేత హస్తం

ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపో తరలింపులో అధికార పార్టీకి చెందిన ఓ ముఖ్యనేత హస్తముందని ఆరోపణలు వస్తున్నాయి. ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి నియోజకవర్గాల్లో ఉన్న మద్యం షాపుల యజమానులకు ప్రయోజనం చేకూర్చడానికే టెక్కలిలో డిపో ఏర్పాటు చేస్తున్నారంటూ హమాలీలు అంటున్నారు. అదీగాక తన సొంత మనుషులకు చెందిన గోడౌన్‌కు అద్దెరూపంలో ప్రభుత్వం నుంచి డబ్బులు ఇప్పించడానికేనంటూ మరోపక్క ప్రచారం సాగుతోంది. టెక్కలిలో డిపో ఏర్పాటు చేస్తే తన నియోజకవర్గానికి చెందిన కొంతమంది మనుషులకు ఉపాధి కల్పించొచ్చనే ఆలోచనతోనే డిపో తరలించాలని చూస్తున్నారని హమాలీలు అంటున్నారు.

హమాలీల ఉపాధికి గండికి

ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపోను విడదీసి టెక్కలిలో కొత్త డిపో ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయంతో ప్రస్తుతం పనిచేస్తున్న కార్మికుల ఉపాధిపై తీవ్ర ప్రభావం చూపనుందన్న చర్చ నడుస్తోంది. ఎచ్చెర్లలో పనిచేస్తున్న కార్మికులకు రోజు వారి వచ్చే ఆదాయం సగానికి పడిపోనుంది. టెక్కలిలో ఏర్పాటు చేయనున్న డిపోలో తమలో కొంత మందికి పని కల్పించాలని డిమాండ్ చేస్తూ మరోసారి ఆందోళనలకు సిద్ధమవుతున్నారు.

డిసిఐ పరిరక్షణ ఉద్యమం చారిత్రాత్మకం

డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా సిఐటియు ఆధ్వర్యాన నిరసన తెలుపుతున్న ఉద్యోగులు (ఫైల్)

సిఐటియు పోరాటంతో ఆగిన ప్రయివేటీకరణ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖలోని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (డిసిఐ) పరిరక్షణ పోరాటాన్ని చారిత్రాత్మకంగా చెప్పొచ్చు. 2018లో డిసిఐని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నూటికి నూరు శాతం ప్రైవేటుపరం చేయాలని నిర్ణయించింది. మొత్తం 1200 మంది ఉద్యోగుల్లో 1000 మంది సముద్రంలోని డ్రెడ్జింగ్ పనుల్లోనూ, 200 మంది పోర్టు ఆవరణలోగల డిసిఐ ఆఫీసులోనూ నాడు పనిచేసేవారు. అక్కడ సిఐటియు ఒక్కటే యూనియన్‌గా ఉంది. డిసిఐ ప్రైవేటీకరణ నిర్ణయం తదుపరి అక్కడ సిఐటియు ఏడాదిపాటు నిరంతర పోరాటం సాగించింది. రెండు లక్షల కరపత్రాలను విశాఖలోనే పంచి ప్రజలను చైతన్యవంతం చేసింది. డిసిఐ ప్రైవేటీకరణకు వ్యతిరేకమా ? అనుకూలమా ? అని బ్యాలెట్ నిర్వహించింది. నూటికి 99 శాతం మంది ప్రైవేటీకరణను వ్యతిరేకించారు. ఏడాది కాలం పాటు పోరాటాన్ని నిర్వహించారు. ఈ క్రమంలో డిసిఐ ప్రైవేటీకరణ జరిగితే తమ భవిష్యత్ అంధకారం అవుతుందన్న ఆవేదనతో విజయనగరానికి చెందిన డిసిఐ ఉద్యోగి ఆత్మహత్యకు కూడా పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో డిసిఐ ప్రైవేటీకరణ వ్యతిరేక ఉద్యమంలో పెద్ద సంఖ్యలో ఉద్యోగులు, కార్మికులు, మహిళా ఉద్యోగులు నిరసనలను తీవ్రం చేశారు.

పార్లమెంట్‌లో చర్చ

పార్లమెంట్‌లో ఈ సమస్యపై చర్చ నడిచింది. డిసిఐలో తక్కువ మంది ఉద్యోగులు, కార్మికులే అయినా పట్టుదలగా వారందరినీ సిఐటియు నిలబెట్టి పోరాటాన్ని సాగించింది. ప్రైవేట్ పరం అయితే సముద్రంపైనా, డ్రెడ్జింగ్ రంగంపైనా విదేశీ పట్టుపెరిగి దేశ రక్షణకే ప్రమాదం అని అందరికీ తెలియజెప్పింది. పోరాటం తీవ్రమవుతున్న దశలో తప్పనిసరి పరిస్థితుల్లో 2019 ఎన్నికలకు ముందు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ డిసిఐ ప్రైవేటీకరణను నిలుపుదల చేస్తున్నట్లు ప్రకటించాల్సి వచ్చింది. ఆ తర్వాత డిసిఐ కేంద్ర కార్యాలయాన్ని సొంత భవనం విశాఖనగరంలోని హెచ్‌బి కాలనీలోకి మార్చడంతో ఉద్యోగులు, కార్మికుల్లో సంతోషంగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రైవేటీకరణ ప్రమాదం నుంచి బయటపడి వైజాగ్ పోర్టు ట్రస్ట్ ప్రధాన పర్యవేక్షణలో నూతన భవనంలో డిసిఐ 2021 నుంచీ కొనసాగుతోంది.

తొలి నుంచీ పోరాటాలే...

1991 నుంచి ప్రైవేటీకరణ, సరళీకరణ, గ్లోబలైజేషన్ (ఎల్‌పిజి) విధానాలపై నిరంతర సమరశీల పోరాటాలను నిర్వహిస్తున్న ట్రేడ్ యూనియన్ సిఐటియు. వైజాగ్ స్టీల్ ప్లాంట్‌లో కాంట్రాక్టీకరణకు వ్యతిరేకంగా, షిప్‌యార్డు, బిహెచ్‌ఇఎల్, విశాఖ పోర్టు, జింక్ తదితర సంస్థల్లో ఈ సంఘం క్రియాశీలకంగా మడు దశాబ్దాలుగా ప్రైవేటీకరణపై పోరాడుతోంది. అడుగడుగునా ప్రభుత్వం నిర్బంధం విధిస్తున్నా ఎక్కడా వెరవలేదు. అదే ఆ సంఘాన్ని కార్మికుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిపింది.

ప్రజాశక్తి
www.prajasakti.com
విజయనగరం, పార్వతీపురం మన్యం
ఆదివారం 4 జనవరి 2026

కదులుతున్న కార్మికులు

నేడు విశాఖలో సిఐటియు మహా ప్రదర్శన, బహిరంగ సభ ● ఉత్తరాంధ్రలో హోరెత్తిన ప్రచారం

ఈ నెల 4న విశాఖ నగరంలో జరిగే సిఐటియు మహా ప్రదర్శన, బహిరంగ సభను జయప్రదం చేయాలంటూ శనివారం ఉత్తరాంధ్రలో ప్రచారం హోరెత్తింది. ఈ సంఘం కార్యకర్తలు కార్మిక వాడల్లో ఇంటింటికీ తిరిగి ప్రజలను ఆహ్వానించారు. బహిరంగ సభకు 'మేము సైతం' అంటూ అన్ని రంగాల కార్మికులూ కదులుతున్నారు. స్కీం వర్కర్లతో పాటు వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు ఎవరికి వారే సొంత డబ్బులతో బస్సులను ఏర్పాటు చేసుకొని బహిరంగ సభకు తరలివెళ్లేందుకు సమాయత్తం అవుతున్నారు.

విశాఖలో 'డప్పుల శబ్దం'

గాజువాకలో డప్పుల శబ్దం ప్రదర్శనలో పాల్గొన్న నాయకులు

గాజువాక : సిఐటియు అఖిల భారత మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ కెవిపిఎస్, ఆంధ్రప్రదేశ్ డప్పు కళాకారుల సంఘం ఆధ్వర్యంలో డప్పుల శబ్దం పేరుతో పాత గాజువాకలో శనివారం కార్మిక మహా ప్రదర్శన చేపట్టారు. ఈ ప్రదర్శనను సిఐటియు సీనియర్ నాయకులు ఎన్.రాజేంద్రప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. పాత గాజువాక నుంచి బయలుదేరిన ప్రదర్శన కొత్త గాజువాక మీదుగా మళ్లీ పాత గాజువాక వరకు సాగింది. భారీ ఎత్తున డప్పులు మోగిస్తూ, ప్రదర్శన చేపట్టారు. అనంతరం జరిగిన సభలో కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎ.మాల్యాద్రి మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు కార్మికులకు హాని చేస్తూ, కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాసేలా ఉన్నాయని తెలిపారు. ఎపి డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎమ్‌డి.ఆనందబాబు మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను మోడీ ప్రభుత్వం కాలరాస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎం.రాంబాబు, సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, ఎం.శ్రీదేవి, ఎల్.బంగారునాయుడు, ఎ.లోకేశ్వరరావు, జి.అప్పారావు, ఇమ్మానుయేలు, ఎం.సరోజినీ, డి.అప్పారావు పాల్గొన్నారు.

పార్వతీపురంలో ప్రచార ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు, కార్మికులు

మోసయ్యపేటలో బొట్టు పెట్టి బహిరంగసభకు ఆహ్వానిస్తున్న ఐద్వా నేతలు

పరవాడ : విశాఖ ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి మున్సిపల్ గ్రౌండ్ వరకు జరిగే కార్మిక మహా ప్రదర్శనను, మున్సిపల్ గ్రౌండ్‌లో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలంటూ శనివారం పరవాడ మండలం తానాం, లంకెలపాలెం, పరవాడ, ఎన్‌టిపిసి, పసుపురపల్లి ప్రాంతాల్లో సిఐటియు నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, స్కీం వర్కర్లకు కనీస వేతనాలను చట్టబద్ధంగా అమలు చేయాలని, అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. అలాగే పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పకడ్బందీగా అమలు చేయాలని, కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రొంగలి కన్నం నాయుడు, జి.సన్యాసిరావు, పి.చిరంజీవి, సత్తిబాబు, తాతారావు, నక్షత్రం, వీరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

మందస మండలం రైస్ మిల్లు కూడలి వద్ద ప్రచారం చేస్తున్న సిఐటియు నాయకులు

రాంబిల్లిలో మాట్లాడుతున్న సిఐటియు నేత దేముడునాయుడు

యలమంచిలిటౌన్ (అచ్యుతాపురం) : అచ్యుతాపురం మండలం, మోసయ్యపేట గ్రామంలో ఐద్వా నేతలు వినూత్నంగా ప్రచారం చేశారు. ఐద్వా కన్వీనర్ ఆర్.లక్ష్మి ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి మహిళలకు బొట్టుపెట్టి, బహిరంగకు రావాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో కడారి కాసులమ్మ, ఉష, అన్నపూర్ణ పాల్గొన్నారు.

యలమంచిలి టౌన్ (రాంబిల్లి) : రాంబిల్లి మండల కేంద్రంలోని కొబ్బరితోటలో సిఐటియు మండల కార్యదర్శి జి.దేముడు నాయుడు కార్మికులతో సమావేశమయ్యారు. విశాఖలో జరిగే కార్మిక మహా ప్రదర్శన, బహిరంగ సభకు తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, కార్మికులు పాల్గొన్నారు.

ములగాడ : ప్రజానాట్యమండలి మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యంలో 60వ వార్డు పరిధిలో డప్పుల శబ్దం పేరుతో డప్పు కళాకారులు ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమంలో బి.ప్రసాద్, డి.రాము, బి.సూరిబాబు, కళాకారులు డి.సూరిబాబు, జె.రామారావు, కుమార్, బి.రాజు, బి.రాంబాబు, కె.రమణ, కె.శరత్ తదితరులు పాల్గొన్నారు.

60వ వార్డులో డప్పులు కొడుతూ ప్రచారం చేస్తున్న కార్మికులు

పార్వతీపురంటౌన్ : పార్వతీపురం మున్సిపల్ కార్యాలయం నుంచి నాలుగు రోడ్ల జంక్షన్ వరకు మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ప్రచార ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మన్యం జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ విశాఖపట్నం ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు మహా ప్రదర్శన ప్రారంభం కానుందని చెప్పారు. అనంతరం మున్సిపల్ స్టేడియం వద్ద బహిరంగ సభ జరగనుందని తెలిపారు. కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బి.సూరిబాబు, సిహెచ్.సింహాచలం, మామిడి శివ, శంకర్రావు, గంగరాజు, శ్రీను, గంగ్గేలు, ఇప్పలమ్మ, పాపులమ్మ, డ్రైవర్లు, మేస్త్రీలు పాల్గొన్నారు.

కొమరాడ : మండలంలో కూనేరు, రామభద్రపురం తదితర అంగన్వాడీ కేంద్రాల వద్ద చలో విశాఖ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు కె.సాంబమూర్తి, అంగన్వాడీ యూనియన్ నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. మండలంలోని ఆశా, అంగన్‌వాడీ, సిహెచ్‌డబ్ల్యులు, విఒఎలు, ఆటో కార్మికులు, మిడ్‌డే మీల్స్ వర్కర్లు, విఆర్‌ఎలు, గ్రీన్ అంబాసిడర్లు, గిరిజనులు, వ్యవసాయ కూలీలు, రైతులంతా ఆదివారం ఉదయం 6.30 గంటలకు గుమడ రైల్వే స్టేషన్‌కు చేరుకోవాలని వారు తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరం: విశాఖలో ఆదివారం జరిగే సిఐటియు బహిరంగ సభను జయప్రదం చేయాలని సిఐటియు మన్యం జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు పిలుపునిచ్చారు. సీతానగరం మండలంలోని సూరంపేట వద్ద ఎఫ్‌సిఐ, సివిల్ సప్లై గోడౌన్ హమాలీ యూనియన్ కార్మిక సభ అధ్యక్షులు పిన్నింటి వెంకటరమణ అధ్యక్షతన జరిగింది. యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.ధనంజయ, వేణు మాట్లాడారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బంటు దాసు, హమాలీ యూనియన్ నాయకులు సిరికి అప్పలనాయుడు, సివిపి శ్రీనివాసరావు, గొట్టాపు సింహాచలం, అక్కేన సింహాచలం, సిఐటియు మండల కార్యదర్శి గవర వెంకటరమణ, మేస్త్రీలు, కార్మికులు పాల్గొన్నారు.

బలిజిపేట : మండలంలోని పెద్దింపేటలో ప్రజా సంఘాల నేతలు చలో విశాఖ బహిరంగ సభ జయప్రదానికి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు వెన్నెల వేణు, మజ్జ దుర్గా రావు, గౌరీశ్వరరావు, ఎం.సూరీడమ్మ తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : నెల్లిమర్ల జ్యూట్‌మిల్ గేటు వద్ద కార్మికులతో సిఐటియు నాయకులు కిల్లంపల్లి రామారావు సమావేశం నిర్వహించారు. సిఐటియు పోరాట ఫలితంగా అక్రమ లాకౌట్ అయిన జ్యూట్‌మిల్ తిరుగుతుందని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో విశాఖలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో టి.వెంకట్రావు, ఎస్.రామారావు, ఎన్.అప్పారావు, పి.రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

మల్కాపురంలో ప్రచార జాతాలో పాల్గొన్న నాయకులు

మల్కాపురంలో ఆటో ప్రచార జాతా

ములగాడ : సిఐటియు మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యాన ఆటో ప్రచార జాతా చేపట్టారు. ఈ జాతాను సిఐటియు మల్కాపురం జోన్ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్షణమూర్తి ప్రారంభించారు. ఈ జాతా మల్కాపురం, శ్రీహరిపురం, హెచ్‌పిసిఎల్, షిప్‌యార్డు, సింధియా, నేవల్ డాక్‌యార్డు పరిధిలోని గొడౌన్స్, ధనరెడ్డి అండ్ గంగిరెడ్డి షిప్పింగ్, శరత్ చటర్జీ, బోత్ర ఐపిఎల్ గొడౌన్స్ ప్రాంతాల్లో సాగింది. అనంతరం జరిగిన సభలో సిఐటియు మల్కాపురం జోన్ నాయకులు, ముఠా కార్మిక సంఘం అధ్యక్షులు పి.పైడిరాజు మాట్లాడుతూ, బహిరంగ సభకు కార్మికులంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఆటో ప్రచార జాతాలో ప్రజానాట్యమండలి ప్రతినిధులు వై.గంగాధర్, సాయి, ఎం.కోటి, శరత్ తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ.. అంగన్‌వాడీలతో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు సాంబమూర్తి

పరవాడలో నిర్వహిస్తున్న ప్రచారం

సీతానగరంలో రైసు మిల్లు కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు నాయకులు రెడ్డి వేణు

బహిరంగ సభ సన్నద్ధత

ఆదివారం విశాఖ నగరంలోని ఇందిరా ప్రియదర్శిని (పాత మున్సిపల్ స్టేడియం)లో జరిగే సిఐటియు బహిరంగ సభకు అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయి. తొలుత ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపంలోని ఎల్ఐసి బిల్డింగ్, అంబేద్కర్ కూడలి నుంచి మహా ప్రదర్శన ప్రారంభమై ఇక్కడకు చేరుకుంటుంది. ఈ నేపథ్యంలో నగరమంతటా ఎర్రజెండాలు, తోరణాలతో అందంగా ముస్తాబైంది. మహా ప్రదర్శనలో రెడ్‌షర్ట్ వాలంటీర్ల కవాతు ప్రత్యేక ఆకర్షణగా నిలువనుంది.

ఏర్పాట్లలో నిమగ్నమైన కార్మికులు

ఏర్పాట్లను పరిశీలిస్తున్న నాయకులు

సిఐటియు అఖిల భారత మహాసభలో
వాలంటీర్ల విశేష సేవలు

- విశాఖ నగరం ముస్తాబు, వేదిక ఏర్పాటులోనూ కీలకపాత్ర
- బహిరంగ సభలో సేవలందించేందుకు సమాయత్తం


మహాసభలో ప్రతినిధులకు సేవలందిస్తున్న వాలంటీర్లు

ప్రజాశక్తి - ప్రత్యేక ప్రతినిధి, కామ్రేడ్ అనతలవట్టం ఆనందన్ నగర్

సిఐటియు 18వ అఖిల భారత మహాసభలో మేము సైతం అంటూ వాలంటీర్లు విశేష సేవలందించారు. సిఐటియుతోపాటు ఎస్‌ఎఫ్ఐ, డివైఎఫ్ఐ కార్యకర్తలు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి సుమారు 500 మంది సహాయ సహకారాలు అందించారు. కార్మిక పోరాటాల దశ, దిశలను నిర్దేశించే అఖిల భారత మహాసభ ప్రతినిధుల సభకు విశాఖపట్నంలోని ఎయు కన్వెన్షన్ సెంటర్ వేదికైన విషయం విదితమే. ఈ కార్యక్రమానికి దేశంలో అన్ని రాష్ట్రాల నుంచి సుమారు 1200 మంది ప్రతినిధులు హాజరయ్యారు. మహాసభకు కేరళ, ఇతర కొన్ని రాష్ట్రాల నుంచి ప్రజాప్రతినిధులు సైతం హాజరయ్యారు. ఈ అతిథులందరికీ ఆతిథ్యం అందించడంలో ఎటువంటి ఇబ్బందులూ చోటుచేసుకోకుండా కట్టుదిట్టంగా ప్రణాళికా బద్ధంగా వాలంటీర్లు సేవలందించారు. డిసెంబరు 31 నుంచి ప్రారంభమైన ఈ మహాసభ.. 4న జరిగే ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో జరిగే బహిరంగ సభతో ముగియనుంది. ఈ నేపథ్యంలో వారం రోజుల ముందుగానే విశాఖపట్నం చేరుకున్నారు. విశాఖ నగరంలోని కూడళ్లను అరుణ పతాకాలతో సుందరంగా అలంకరించడంలో తమ వంతు సహకారం అందించారు. అదే విధంగా ఎయు కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన అనంతవట్టం ఆనందన్ నగర్ వేదికను రూపొందించడంలోనూ సహకరించారు. అతిథులకు ఎటువంటి అసౌకర్యాలూ లేకుండా రవాణా సౌకర్యాలు కల్పించారు. ఈ మహాసభకు హాజరైన ప్రతినిధులను ఎయు కన్వెన్షన్ సెంటర్‌లోని ప్రాంగణానికి చేర్చడం, సమావేశం అనంతరం తిరిగి వారికి వసతి కల్పించిన హోటళ్లకు తరలించడంలోనూ ఉత్సాహంగా పనిచేశారు. అతిథులకు భోజన శాలల్లోనూ సేవలందించారు. చలిలోనూ రాత్రింబవళ్లు సేవలందించి ప్రతినిధుల మన్ననలు పొందారు. ఆదివారం జరిగే బహిరంగ సభలోనూ తమ సేవలను కొనసాగించేందుకు సమాయత్తం అయ్యారు.

శ్రామిక భూమిక

పారిశ్రామిక పారిజాతం కోసం
స్వర్గానికి గురి పెట్టిన పొగగొట్టాలే
చట్టాలను నేల మట్టానికి తొక్కేస్తున్నాయి...
మేథో హక్కులో వాటా ఉన్నా
మేత హక్కుల డాటా దొరకదు...
మేడేలు తెచ్చిన త్యాగాలు కాలేవు
నీరోలు వాయించే ఫిడేళ్లు...
కూలి పైసల ఆశలతో బులిపిస్తూ
కోటి కలల్ని నమ్మబలికిస్తున్న
బహుళ జాతి
కోరుకుంటున్న మరబలికి
ఇప్పుడు
ఇరవై బాహువుల పని సరిపోదు
ఇల నెలవైన
సైకత తైలపు కొలువులో
ఇల్లు గడవడానికి
వెయ్యి చేతుల నైపుణ్యం కావాలి...
పది తలల తెలివిడి చాలదు
శతావధాన శిఖరారోహణాలు కావాలి...
పటిమ ఉంటే
పదవి ఊడదనే భ్రమలేదు
పాదాభివందనాలు చేసినా సరే....
బతిమాలినా
బుగ్గిలోని బతుకు చెల్లునా...
చిట్లిపోయిన
శివుని విల్లు అతుకునా.....
ప్రతిభలోనూ మేలిమికే
ఎక్కే మెట్టు దొరుకుతుంది
పోటీలో ఎగబాకడానికి
పొట్టలో డొక్కలాడిస్తే కుదరదు
మెక్కే మెతుకులూ అంతే...!!
అమ్ములపొదిలోని సమ్మెని కూడా
అమ్మకానికి పెట్టేస్తున్న స్వాములకు
కౌరవుల పైరవీలకు
కాల్మొక్కే పతాకాలకు
కార్మికుల ఓర్మిలో కానరావు
ఒరలో విశ్రాంతి తీసుకొంటున్న
వీర కరవాలాల ఆకలి చేవ్రాళ్లు....!!

లాభాల గనిలోని లావాలు

లాభాల కోసమే
ఇప్పుడు వాడు
ఆలోచించడం లేదు
దాస్యానికి కూడా
దస్తావేజులు రాయాలంటున్నాడు
తెల్ల కాగితాల కట్టల్లోకి
పట్టా భద్రత లేని తెల్ల కాలరు వెట్టిగా
చుట్టేసి...
కన్నేసిన వాడిపై మన్నేసినా....
ఇన్నేసి పన్నేసిన పన్నాగాలా....
నెత్తురు బొట్లు బొటబొట కారుస్తూ
కుర్ర శిరస్సులతో అల్లిన ఎర్ర తివాశీ
ఇక్కడ ఓ కుటీర పరిశ్రమ...
పూర్ణ కుంభ తీర్థం పుచ్చేసుకున్న ప్రభువులే
పండుగ ప్రభలు నిండు ప్రలోభాలకు ...
త్వరలోనే అయిదునాళ్ల పని దినాలు
నాలుగు రోజులకు కుదించాలనుకొంటున్నట్లు
కలలకు బంగారు రంగులద్దుతున్నాడు
బలిమిదీరా బుర్రపైన రుద్దడానికి...
ఇంటి వద్దనుండే పని అని
నమ్మబలికినవాడు...
కంటి రెప్పల వెంట్రుకలకే
సుమస్సుకుమారంగా కట్టేస్తున్నాడు
నొక్కుడు పెట్టెని నొప్పులు
తెలియనివ్వకుండా....
పంటి దగ్గరికే కంచం పంపిస్తున్నాడు
కట్టుగొయ్య పక్కనే పచ్చిక పరకలు
పరిచినట్టు...
పనికి పోషకాహార పథకం...
గొంతు ఎండిపోయి కంఠం కణుసు బారక
ముందే లొట్టి నిండా ద్రావణాలు...
కునుకు రానీయని పానీయ సేవనం..
పీటకు జిగుర్రాసినట్టు
అణువైనా కదలనివ్వని వంటిలోని కండరాలు
తిమ్మిరెక్కి చచ్చుబడక పూర్వమే
జిమ్ములో కుమ్ములాటలు....
నిమిలిత నిద్రకు నియమితమైన మంచం....
వేలి ముద్రలతో వేళల నమోదుకి
ముఖ ముద్రలతో పలు వరుస మధ్య నుంచీ
జారిపోయిన నవ్వుల స్మృతులు ...
నఖ ముద్రలతో దుఃఖపు చుక్కల లెక్కలు...
పగలు లేదు... రేయీూము లేదు....
పెండ్లాము లేదు.... పిలగాండ్లు లేరు....
నోటి కాడ తేప గొట్టాలు...
చెవుల్లోకి దూర్చిన తీవెలు...
చూపుల చూరున మెరుపుల్లా చురుక్కున
మురిపించే చెరకు పానకపు పూర్ణ పోరాణ
దృశ్యాలు....
తెలుగోడి తెలివి తేటలు మేలు జాతి అశ్వాలు
ఇప్పుడు కలిమి కోటలకు వశ్యాలు....
అధికారికంగా తాళి కట్టేసిన
అరచేతి వైకుంఠ పాళిలో
ఆరు నెలలకో ఆరోహణం....
ఆరోగ్యమే పణంగా...
తరువాత బాసురోత్తములు మోగించే
బాజాలతోటి గజారోహణం...
ఎవరి ఊసుల ఉసురో బెడిసికొడితే
మొలిచిన అడ్డు ఊచలతో కథ ముగించే
అసుర భీభత్స క్షేత్రం...
ఆ తరువాత వైకల్పిత వైపై వైరాగ్యం.......
తొట్ట తొలుత పూలహారాలు మెడలోకి..
తరువాత ఫల హారాలు కడుపులోకి....
ఆ తదుపరి గురు త్వరణపు గుణ కారాలు....
కారాలు నూరేసిన కార్య చాలనాలు...
చివరి చరణానికి భాగ హారాలు.....
ఈర్ష్యలు ఈటెలై పొడిచినప్పుడు కారినవి
ఎర్రటి ఊటలు కావు ఇక్కడ మేట వేసినవి....
మడి కట్టుకొన్న
తోడేళ్ల ఉపవాసాలకు
మేడే మేల్కొలుపులు
తాకట్టు వస్తువులు కావు
తాట తీసే వేట పనిముట్లు!

సైబరు బరువులు...

గుబురుటాకుల మధ్య నుంచీ
కబురు పెట్టినట్టు
గబుక్కున పిలుస్తూనే
గాండ్రించే మృగాధిపత్యాల్నీ....
ఘీంకరించే మదపుటేనుగుల
దంతతొండాల ద్వంద్వ తాండవాల్నీ....
ద్రోహ ద్వారబంధాల నడుమ
దొరవారి వ్యూహాల్నీ చీల్చుకొని
శీఘ్రంగా పూర్తి చేస్తానంటే కూడదిప్పుడు
వెంటాడే వ్యాఘ్రాల కోరలకు చిక్కకుండా
అతి శీఘ్రంగా పని ముగిస్తేనే
గూడు చెదరకుండా
కూడు దొరుకుతుంది..!
నోటితో కాకుండా నొసటితోనే
బుస కొట్టే బాసుల
నీలి బుస్కోట్ల చప్పుడుకి
వణికించే చలి కొట్టాల్లోనూ
గాలి ఘనీభవిస్తుంది
గాజద్దాల్లోని భయార్ద్ర క్షణాలను
గజ గజ వణికించెయ్యడానికి...
కీ ఇచ్చిన గడియారం ముళ్లు
ముల్లుగర్ర గుచ్చిన గానుగెద్దులు
కనులకు గంతలు కట్టుకొని
కొయ్య గుంజ చుట్టూ తిరుగుతూనే
ఉంటాయి...
గుడి గంటలు మెడలో మోగుతుంటే
మెదడులో మౌన మేఘాలు
పరుగెడుతుంటాయి..
కాళ్ల మీద పడే వేళల్ని
వేళ్ల మీద లెక్కించే బేరాలు...
ఉట్టి దాకా ఎగరనియ్యని
వెట్టికి కూడా వేలం పాటలు....
ఎర్రటి బొట్లు కనిపించకుండా
రక్తంలోని శక్తినంతా తోడేసే
తోడేలు నాలుకల తొండి ప్రణాళికలు....
చిరు ఉపాధి వ్యాధిగ్రస్తులకు
చీకటి ఉపవాస ప్రార్థనలు....
సూర్యుడు చురుక్కుమనే
ముందు నుంచీ
చుక్క పొడిచే వరకూ.....
నడిచే విధులకు తిథులూ, తిరనాళ్లూ
ఉండవు....
వ్యయ భారం మోయలేని
కళేబరాలకు వ్యాయామ నియమాలు...
ధన వ్యామోహంతో
ఉబ్బిపోయిన దేహాలు తగ్గడానికి
ధ్యాన శిక్షణా శిబిరాలు...
ఆరోగ్య భద్రత లేని బర్రె తోక బడుగులకు
మర్రి చెట్ల కింద ఆధ్యాత్మిక బోధనలు...
ఆహార్యోక్తులతో దేహార్తి తీరని
వైరాగ్య భాష్యాలు....
బత్తాయి తొక్కలే భత్యాలు నిర్ణయిస్తూ
మీటలే మీసాలు మెలేస్తున్న చోట
వెంట్రుక ముక్కలే కొండలతో పని
చేయిస్తాయి...
స్వేద మథనం కోసమై
ఆకలి దప్పులు ఎరుగని
దేవతలు అధికారులు
దిద్దలేని తప్పులు చేసే
రాక్షసులు కార్మికులు...
శిలారాధనమే చిల్లర సాధనకు
ఆరోతనమైన చోట
పురాతనమే పూరించలేని
మహోద్యమ శంఖం...
తినడానికి నూకలు లేని
ఘర్మ సిక్తమైన నేలలో
ధర్మ యుక్తమైన
సనాతనమే సరికొత్త శాసనం....
విలుకాడి నైపుణ్యాన్ని కాదని
నిలువు నామాల నమ్మకానికి
నిలువు కాళ్ల జీతం..
కుప్పలు పోసిన కలల కలశాలతో
రెప్పలు వాలిచేసిన ఏకాగ్ర నేత్రాలకు
తీక్షణ వీక్షణాల కూలీ..
ఊడిగం లాంటి బాడుగ ఉద్యోగం
ఎప్పుడు ఊడుతుందో తెలీదు...
ఎవని ఉచిత పథకం
ఓ కించిత్తు కాగితమై ఎగిరి
ఎవని ఉదరం మీద ఎత్తి కొడుతుందో
తెలీదు....
పార్లమెంటు పెరటి వాకిట్లోంచీ
పొర్లాడి పారొచ్చిన దొర్లాటకం
పోరాట వీరుల నుదుట
దిద్దుతున్నది ఎర్రటి తిలకం....!!

- డాక్టర్ సుదేరా
(సిఐటియు అఖిల భారత మహాసభ విశాఖలో జరుగుతున్న సందర్భంగా రాసిన దీర్ఘ కవిత)

ఉద్యమాల సారథి.. చైతన్య వారథి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఈ కొత్త సంవత్సరం శ్రామిక వర్గానికి అత్యంత ఉత్సాహంగా ప్రారంభమైంది. పోరాటాలకు కేంద్రమైన విశాఖలో సిఐటియు 18వ అఖిల భారత మహాసభ జరుగుతుండటంతో కొద్ది రోజులుగా ఇక్కడ పండగ వాతావరణం నెలకొంది. ఈ మహాసభ భవిష్యత్తు కార్మిక ఉద్యమాలకు దిక్సూచిగా నిలువనుందని కార్మిక నేతలు, మేధావులు, ప్రగతిశీలవాదులు భావిస్తున్నారు. ఈ నెల 31న ప్రారంభమైన మహా సభకు నాలుగు రోజుల ముందే ఎయు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో శ్రామిక ఉత్సవ్ ప్రారంభమై ఈ నెల 2 వరకూ సాగింది. ఇది అందరిలో ఉత్సాహం.. ఉత్తేజం నింపింది. సినీ ప్రముఖులు, జిల్లా ఉన్నతాధికారులు ముఖ్య అతిథులుగా హాజరై శ్రామిక ఉత్సవ్‌కు వన్నె తెచ్చారు.

శ్రామిక ఉత్సవ్‌లో పుస్తక ప్రదర్శన తలపెట్టగా భారీగా పుస్తక ప్రియులు హాజరయ్యారు. సైన్స్, ఫొటో, కార్టూన్, రైల్వే ఎగ్జిబిషన్లు అందరినీ ఆకట్టుకున్నాయి. చైతన్యం నింపాయి. సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. సాహిత్య వేదికపై ఏడు రోజులపాటు పలు అంశాలపై సాహిత్య సదస్సులు జరిగాయి. 28న జరిగిన శ్రమకవనంలో పెద్ద సంఖ్యలో కవులు, రచయితలు, గాయకులు పాల్గొని శ్రమ గొప్పతనాన్ని తెలియజెప్పారు. సినీ నటులు ప్రకాష్‌రాజ్, రోహిణి, మాదాల రవి, బాబ్జి, సత్యారెడ్డి, దర్శకులు రాజమురుగన్, సృజన్, ప్రముఖ కవి, సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ ఈ ఉత్సవ్‌కు హాజరై తమ సందేశాలనిచ్చారు. వారి ప్రసంగాలు ఉత్సాహం నింపాయి.

మరోవైపు సిఐటియు అఖిల భారత మహాసభను జయప్రదం చేయాలంలూ నెల రోజుల పాటు విశాఖలో ప్రచారం హోరెత్తింది. ఆటో, జీపు జాతాలు, పోస్టర్ ఆవిష్కరణలు, ఉచిత వైద్య శిబిరాలు, జోన్ల స్థాయిలో శ్రామిక ఉత్సవాలు, గ్రూపు మీటింగ్‌లు, గేట్ మీటింగ్‌లు జరిపారు. నగరాన్ని జెండాలు, తోరణాలతో కార్మికులు ఎరుపుమయం చేశారు. ఆదివారం జరిగే మహా ప్రదర్శన, బహిరంగ సభకు భారీగా తరలివెళ్లేందుకు సమాయత్తం అయ్యారు.

ప్రజాశక్తి
ఆదివారం 4 జనవరి 2026

కోరెడ్ల కుటుంబం సమాజ సేవకే అంకితం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

కోరెడ్ల కుటుంబం ప్రజాసేవకే అంకితమైందని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. శనివారం పారాది ప్రాథమికోన్నత పాఠశాలలో కోరెడ్ల సంజీవినాయుడు వర్ధంతి సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు యుటిఎఫ్ రూపొందించిన టెన్త్ క్లాస్ మోడల్ టెస్ట్ పేపర్స్‌ను ఉచితంగా పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పీడీ వెంకట నాయుడు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముందుగా సావిత్రీబాయి పూలే చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంజీవినాయుడు తమకు మంచి సన్నిహితులు, అనుబంధం ఉన్న వ్యక్తి అని, అటువంటి ప్రగతిశీల భావాలు కలిగిన కుటుంబాన్ని తాను ఎక్కడా చూడలేదని అన్నారు. నైతిక విలువలకు ప్రతిబింబం కోరెడ్ల కుటుంబం అని కొనియాడారు. విద్యావ్యాప్తి కోసం, సమాజంలో మంచి మార్పులు కోసం నిరంతరం కృషి చేస్తున్న ఆ కుటుంబం అందరికీ ఆదర్శం అని బేబినాయన కొనియాడారు. పదో తరగతి విద్యార్థులు యుటిఎఫ్ అందించిన మోడల్ టెస్ట్ పేపర్స్‌ను వినియోగించుకుని మంచి మార్కులు సాధించాలని పిలుపునిచ్చారు. యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు విజయగౌరి మాట్లాడుతూ విద్యాభివృద్ధే లక్ష్యంగా గత పదేళ్లగా కృషి చేస్తున్నా మన్నారు. గతంలో ఈ పుస్తకాలు వల్ల మంచి ఫలితాలు సాధించామన్నారు. సృజనాత్మకతతో విద్యార్థులు నిరంతరం కృషి చేయాలని కోరారు. యుటి ఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి, మండల అధ్యక్షులు పిబి మహేష్, నాయకులు చొక్కాపు మహేష్, శ్రీనివాస్, సుజాత, వెంకట్ నాయుడు, గ్రామ పెద్దలు అల్లాడ భాస్కర్ రావు, స్కూలు కమిటీ ఛైర్మన్ పాల్గొన్నారు.

మోడల్ టెస్ట్ పేపర్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

అనాధ బాలుడికి మాజీ సైనికుడి సాయం

ప్రజాశక్తి - జామి

మండలంలోని రామయ్యపాలెం ప్రభుత్వ పాఠశాల విద్యార్థి ముంత గౌతమ్‌కు బీమసింగికి చెందిన మాజీ సైనికుడు పిజి నర్సింగరావు రూ.6 వేలు ఆర్థిక సాయం అందించి ఆదర్శంగా నిలిచారు. గౌతమ్ పసి వయసులోనే తల్లి మరణించగా, అనారోగ్యంతో ఇటీవల తండ్రి కూడా మరణించాడు. అప్పటి నుంచి నానమ్మ వద్దే ఉంటూ 2వ తరగతి చదువుకుంటున్నాడు. ఈ నేపథ్యంలోనే యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వర్రావు ద్వారా గౌతమ్ దయనీయ స్థితిని తెలుసుకున్న నర్సింగరావు ఆర్థిక సాయం అందించారు. దీనికి యుటిఎఫ్ నాయకులు ధన్యవాదాలు తెలియజేశారు.

నగదు అందిస్తున్న నర్సింగరావు

ప్రజా సేవా? రాజకీయ సేవా?

రాజాంలో ప్రభుత్వ ఉద్యోగి రాజకీయ భజన
నిబంధనలకు విరుద్ధంగా టిడిపి ఫ్లెక్సీలు ఏర్పాటు

ప్రజాశక్తి - రాజాం

ప్రభుత్వ ఉద్యోగిగా బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన వ్యక్తే రాజకీయ భజనకు దిగడం తీవ్ర దుమారం రేపుతోంది. ఈ మేరకు రాజాం పురపాలక సంఘం పరిధిలోని ఆరో వార్డు సారధికి చెందిన గూనాపు ధర్మారావు, ప్రస్తుతం రాజాం టౌన్‌లో ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ లైన్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నారు. స్థానిక రాజకీయ నాయకులతో కలిసి రాజాం ఎమ్మెల్యేకు నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతూ టిడిపి క్యాంపు కార్యాలయం ఎదుట భారీ ఫ్లెక్సీ ఏర్పాటు చేయడంపై పలువురు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయాలకు పూర్తిగా దూరంగా ఉండాలనే స్పష్టమైన నిబంధనలు ఉన్నప్పటికీ, వాటిని బహిరంగంగానే ఉల్లంఘిస్తూ రాజకీయ నాయకులతో కలిసి ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగి అంటే ఏ రాజకీయ పార్టీకి చెందకుండా, ప్రజలందరికీ సమానంగా సేవలు చేయాలి. అయితే ప్రజాధనంతో జీతాలు పొందే ఈ ప్రభుత్వ ఉద్యోగి, ఈ విధంగా అధికార దుర్వినియోగానికి పాల్పడటం ప్రజాస్వామ్యానికి గండి కొట్టడమేనని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇది కేవలం శుభాకాంక్షల వ్యవహారం కాదని, రాజకీయ అనుకూలత కోసం ప్రభుత్వ ఉద్యోగి తన హోదాను మరిచి వ్యవహరించాడని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇలాంటి చర్యల వల్ల ప్రభుత్వ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కోల్పోయే ప్రమాదం ఉందని పలువురు బహిరంగానే విమర్శలు చేస్తున్నారు. ఈ ఘటనపై ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

గూనాపు ధర్మారావు (వృత్తంలో ఉన్న వ్యక్తి)

అవయవ దాతకు అభినందనలు

ప్రజాశక్తి - వంగర

మండలంలోని ఎం.సీతారాంపురం గ్రామానికి చెందిన కలిగి ఆదినారాయణ గత నెలలో బ్రెయిన్ డెడ్‌తో రాగోలు జెమ్స్ ఆసుపత్రిలో మృతి చెందడంతో అతని అవయవాలను కుటుంబ సభ్యుల అంగీకారంతో దానం చేశారు. ఇందులో భాగంగా అతని నేత్రాలను ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో కళ్యాణ్ మగతపల్లి నేత్ర సేకరణ కేంద్రానికి అందించారు. ఈ సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నేత్ర సేకరణ కేంద్రం తరుపున నేత్ర దాత ప్రశంసా పత్రాన్ని మృతుని భార్య కలిగి జయమ్మ, ఆయన కుమారుడైన కలిగి అచ్యుతరావుకు పెంకి చైతన్య అందజేశారు. గ్రామీణ ప్రాంతమైన ఎం సీతారాం పురం గ్రామం నుండి అవయువ దానం ఎంతో మందికి స్ఫూర్తిదాయకంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గేదెల రవితేజ, మహిళా సంరక్షణ కార్యదర్శి చౌదరి ఆశలత పాల్గొన్నారు.

జూదరులపై కఠిన చర్యలు

ప్రజాశక్తి- గంట్యాడ

రానున్న సంక్రాంతి పండగ సందర్భంగా పలు ప్రాంతాలలో వివిధ పందేలను నిర్వహించిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సాయికృష్ణ అన్నారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడతూ సంక్రాంతి పండగ నేపథ్యంలో మండలంలోని ఉన్న అన్ని గ్రామాల్లోనూ ఆకస్మిక దాడులు నిర్వహిస్తామని, ఎవరు కోడి పందేలు, పేకాట ఆడినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సంక్రాంతి పండగను ప్రజలందరూ ఆనందంగా జరుపుకోవాలన్నారు.

గ్రామ సర్వేయర్ల సమస్యలు పరిష్కరించాలి

భోగాపురం: భూ రీసర్వే ప్రక్రియలో అనేక సమస్యలు ఎదురవుతున్నాయని గ్రామ సర్వేయర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు శనివారం తహశీల్దార్ రమణమ్మకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సర్వేయర్లు మాట్లాడుతూ భూ రీసర్వే కోసం అధిక ఒత్తిడి చేస్తున్నారని, సర్వే చేసేందుకు తగిన వసతుల లేవని ఎదో రకంగా నెట్టుకోస్తున్నా తమకు తగిన గుర్తుంపు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ఒపి ప్రకారం నిర్దిష్ట కాలవ్యవధితో రీ సర్వే చేపట్టాలని, సంబంధిత గ్రామాల్లో విఆర్‌ఒలు, ఆర్ఎస్‌డిటిలు తప్పనిసరిగా పాల్గొని అడంగల్, ఆర్ఒఆర్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన

వేపాడ: మండలంలోని బల్లంకి గ్రామాన్ని ఆనుకుని ఉన్న రైవాడ కాలువ వద్ద బ్రిడ్జి నిర్మాణానికి ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి శనివారం శంకుస్థాపన చేశారు. టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు, డిసిఎంఎస్ ఛైర్మన్ గొంప కృష్ణ, విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ ఛైర్మన్ పిల్లా శ్రీనివాసరావు ఎమ్‌పి శ్రీభరత్‌తో మాట్లాడి బ్రిడ్జి నిర్మాణానికి రూ. 43.65 లక్షలు మంజూరు చేసేలా కృషి చేశారని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి అధికారులు శ్రీనివాస్, భరత్, డిఇ వీరయ్య, ఎఇ మోహన్, పోలినాయుడు, టిడిపి మండల నాయకులు గుమ్మడి భారతి, పి రమణ, కె.రమణమూర్తి, సేనాపతి గణేష్, మాజీ సర్పంచ్ సిరికి సూర్య నారాయణ, గొర్రె నాగరాజు, బల్లంకి గ్రామ వైస్ సర్పంచ్ ధనుంజయ, బల్లంకి గ్రామ పెద్ద కనకరాజు, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలన్నీ పరిశుభ్రంగా ఉండాలి : డిడిఒ

వంగర: గ్రామాలన్నీ పరిశుభ్రంగా ఉండేలా చూడాలని డివిజనల్ డెవలప్మెంట్ అధికారి (డిడిఒ) హేమసుందర్ అన్నారు. మండలంలోని ఎం.సీతారాంపురం సచివాలయాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. ఆ గ్రామంలో ఉన్న వాటర్ ట్యాంకును పరిశీలించిన తరువాత స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే, ఇంటి పన్ను వసూలు తదితర అంశాలపై చర్చించారు. వలస వెళ్లినవారు సంక్రాంతికి గ్రామాల్లోకీ వచ్చేవారికి పారిశుధ్య ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ టి.రాజారావు, డిప్యూటీ ఎంపిడిఒ కెల్ల రామారావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారంపై అసంతృప్తి

జామి: ప్రజా సమస్యల పరిస్కార వేదికలో నమోదైన ఫిర్యాదులు పరిస్కరించడం పట్ల మండల ప్రత్యేక అధికారి డ్వామా పీడీ ఎస్.శారదాదేవి అసంతృప్తి వ్యక్తం చేశారు. శనివారం మండలంలోని అలమండ-1, 2, లోట్లపల్లి, అన్నమురాజుపేట సచివాలయాలను సందర్శించారు. పిజిఆర్ఎస్ అసంతృప్తి చెందిన ఫిర్యాదు దారులతో ఆమె మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సచ్చివాలయం సిబ్బంది రికార్డలను పరిశీలించి ప్రభుత్వం ఏదైతే సర్వేలను ప్రజలకు అందుబాటులో ఉంచిందో త్వరగా పూర్తిచేయాలన్నారు. ఈ సందర్శనలో ఎంపిడిఒ అప్పలనాయుడు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా దర్బార్ నిర్వహించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని ముంజేరు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే లోకం నాగ మాధవి శనివారం ప్రజాదర్బార్ నిర్వహించారు. పలువురు సామాజిక, వ్యక్తిగత సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. గ్రామాల్లో మౌలిక వసతులు కల్పన, ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాల మార్పిడి, పాడైపోయిన సి.సి రోడ్ల మరమ్మతులు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు. అన్నదాత సుఖీభవ పథకం అమలులో సాంకేతిక ఇబ్బందులు, వితంతు పెన్షన్ల, ఉపాధి పనులు కల్పించాలని, గ్రామాల్లో తాగునీటి ఎద్దడిని నివారించాలని, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరుతూ వినతి పత్రాలను అందజేశారు. ఏటి అగ్రహారం గ్రామస్తులు తమ గ్రామానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్ట్ పరిహారం సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మట్టా అయ్యప్ప, రామకృష్ణారెడ్డి, వందనాలు రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా దర్బార్‌కు 50 వినతులు

శృంగవరపుకోట: ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి ఆధ్వర్యంలో లక్కవరపుకోటలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమానికి 50 వినతులు అందాయి. వాటిలో ముఖ్యంగా ఉండడానికి ఇళ్ల స్థలాలు, వృద్ధాప్య, వికలాంగుల పింఛన్లు, రెవెన్యూ సమస్యలు, సీసీ రోడ్లు డ్రైనేజ్ వంటి సమస్యలు ఎన్నో తన దృష్టికి వచ్చినట్లు ఆమె తెలిపారు. అర్జీలకు సంబంధించిన అధికారులతో అక్కడే మాట్లాడి సమస్యలన్నీ త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కరెడ్ల ఈశ్వరరావు, పిఎసిఎస్ ఛైర్మన్ జిఎస్‌నాయుడు, రాష్ట్ర కార్యదర్శి కరెడ్ల ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి పేదలకు వరం

ప్రజాశక్తి- భోగాపురం

ఆపదలో ఉన్న పేదలు, అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబాలకు సిఎం సహాయ నిధి వరం లాంటిందని ఎపి మార్క్‌ఫెడ్ ఛైర్మన్, నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జ్ కర్రోతు బంగార్రాజు అన్నారు. శనివారం మండలంలోని పోలిపల్లి గ్రామంలో తన నివాసం వద్ద 41 మంది లబ్ధిదారులకు రూ.22.49 లక్షల సిఎం సహాయ నిధి చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదవాడికి మెరుగైన వైద్యం అందాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయమని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధతో పనిచేస్తున్నామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సీఎంఆర్ఎఫ్ సాయం అందేలా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరుపులు పంపిణీ

ప్రజాశక్తి - బొబ్బిలి

స్థానిక సింహాలతోటలో ఉన్న గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బేబినాయన శనివారం పరుపులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోటరీక్లబ్ ఆధ్వర్యంలో రూ.2 లక్షలు విలువ చేసే 100 పరుపులను పంపిణీ చేయటం అభినందనీయమన్నారు. రోటరీ వార్షిక గ్రాంట్ లక్ష ఏభై వేలుకు బొబ్బిలి రోటరీ మరో లక్ష ఏభై వేలు కలిపి 3 లక్షల రూపాయలతో 150 పరుపులు వసతి గృహ బాలికలకు పంపిణీ చేయటం రోటరీ సేవా కార్యక్రమాలకు అద్దంపడుతుందన్నారు. రోటరీ జిల్లా అధ్యక్షులు జె సి రాజు మాట్లాడుతూ రోటరీ ద్వారా బొబ్బిలి పట్టణ, పరిసర ప్రాంతాల మహిళలకు 100 కుట్టు మిషనులు, చదువుకొనే బాలికలకు 50 సైకిళ్లు, గ్రంథాలయాలకు పుస్తకాలు, బొబ్బిలి పార్క్ వద్ద రోటరీ బస్ షెల్టర్‌ను, కోటి చెరువు గట్టుమీద సోలార్ లైట్లు, సిమెంట్ బెంచీలను ఇలా ఎన్నో సేవాకార్యక్రమాలు రోటరీ ద్వారా నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో భాగంగానే రెండు లక్షల రూపాయలతో వసతి గృహంలో చదువుతున్న గిరిజన బాలికలకు పరుపులను బొబ్బిలి రోటరీ సమకూర్చిందన్నారు. బొబ్బిలి ఎస్‌టిఒ పద్మనాభం మాట్లాడుతూ పాఠశాలకు రహదారి, వీధి దీపాలు సమకూర్చడానికి కృషి చేస్తానని అందుకు రోటరీ సహకారం అందించాలని కోరారు. అనంతరం బాలికలు వేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను రోటరీ ప్రతినిధులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గెంబలి శ్రీనివాసరావు, బంగార్రాజు, అల్లాడి భాస్కర రావు, పాఠశాల హెచ్‌ఎమ్ జ్యోతి కుమారి, రోటరీ క్లబ్ అధ్యక్షులు శ్రీహరి, కార్యదర్శి శివ కాంత్, సింద్రీ శ్రీనివాసన్, యూత్ ఛైర్ డేవిడ్ జె.విక్టర్, ప్రవీణ్ కుమార్, జయ ప్రకాష్, పాఠశాల, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య సేవలను ప్రజలకు చేరువ చేయాలి

ప్రజాశక్తి - జామి

వైద్య, ఆరోగ్య సిబ్బంది, అంకితభావంతో పనిచేసి, ప్రజలకు ఆరోగ్య సేవలను చేరువ చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖదికారి డాక్టర్ ఎస్.జీవనరాణి అన్నారు. శనివారం జామి పిహెచ్‌సిని ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించడంతో పాటు, సిబ్బంది క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండే విధంగా ఉండాలన్నారు. అసంక్రమణ వ్యాధులపై ప్రజలకు ఆరోగ్య అవగాహన సదస్సుల ద్వారా తెలియచేయాలన్నారు. రోగులకు సేవలందించేటప్పుడు, వారితో ఆత్మీయంగా మాట్లాడి, సేవలు అందించాలన్నారు. ఆసుపత్రిలో పరిశుభ్రత ఉండే విధంగా సిబ్బంది చర్యలు తీసుకోవాలని, ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగహహన కల్పించాలని అన్నారు. రోగి వివరాలను ఈహెచ్‌ఆర్‌లో నమోదు జరిగే విధంగా చూడాలన్నారు. ఒపి సేవలు అందించడంతో పాటు, ప్రజలకు ఆరోగ్య అవగాహన కల్పించినట్లైతే ఆరోగ్యవంతమైన సమాజం నిర్మించడం సులభమవుతోందన్నారు. ఈ కార్యక్రమంలో జామి వైద్యాధికారి డాక్టర్ ఎన్. నాగ శ్వేత, సి.సి. రాజు, డిప్యూటీ హెచ్‌ఇఒ ఎన్. అనిల్ ప్రేమకుమార్, వైద్య సిబ్బంది ఫ్లోరెన్స్, భవానీ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛత సంక్రాంతి నిర్వహణ

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎల్‌పిఒ నాగభూషణ్ మాట్లాడుతూ ఈనెల 4 నుంచి 9 వరకు అన్ని గ్రామాల్లోనూ స్వచ్ఛత సంక్రాంతి కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పరిసరాల పరిశుభ్రత, బహిరంగ బహిర్భూమి, చెత్తాచెదారం లేకుండా ఉండాలన్నారు. గ్రామంలో విద్యార్థులకు ముస్తాబు కార్యక్రమం ద్వారా పాఠశాలకు వెళ్లేటప్పుడు శుభ్రంగా వెళ్లేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. స్వర్ణ పంచాయితీల యాప్ ద్వారా ఆన్లైన్లో ఇంటి పన్నులను ఈ నెలాఖరుకు శతశాతం చేయాలన్నారు. స్వామిత్ర కార్యక్రమం ద్వారా గతంలో చేపట్టిన 15 గ్రామాల్లో సర్వేను పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఎంపిడిఒ ఎంఎల్ఎన్ ప్రసాద్, డిప్యూటీ ఎంపిడిఒ కెకె కుమార్ వర్మ, డిటివి ఉమామహేశ్వరరావు, వివిధ గ్రామాల ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎస్ఐగా వెంకన్న బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - పాలకొండ

పాలకొండ ఎస్ఐగా డోల వెంకన్న శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఎస్ఐ కె.ప్రయోగమూర్తి పార్వతీపురం టౌన్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటానన్నారు. అలాగే నేరాలు అదుపులో ఉండేలా చూస్తామన్నారు.

ఈస్ట్ కోస్టల్ రైల్వే జిఎం, డిఆర్ఎంలను కలిసిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఈస్ట్ కోస్టల్ రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్, వాల్తేర్ రైల్వే డిఆర్ఎం లలిత్ బోహ్రాను స్థానిక ఎమ్మెల్యే విజయ్‌చంద్ర శనివారం కలిశారు. విశాఖలో వారిని కలిసిన ఎమ్మెల్యే నర్సిపురం రైల్వే స్టేషన్ సమస్యలను వివరించి సత్వరం వాటిని పరిష్కరించాలని కోరారు. స్టేషన్ వద్ద గల గోడను తొలగించి లైను ఏర్పాటు చేసి రైతులు తమ పంటలను తరలించుకొనేలా వీలు కల్పించాలని రైల్వే ఉన్నతాధికారులకు ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. అలాగే పార్వతీపురం నుంచి హైదరాబాదు, తిరుపతికు ప్రత్యేక రైళ్లు నడపాలని కోరారు. ఎమ్మెల్యే ప్రతిపాదనలపై స్పందించిన డిఆర్ఎం లలిత్ బోహ్రా, జిఎం పరమేశ్వర్ ఫంక్వాల్ త్వరలోనే వాటికి పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

డిప్యూటీ డిఇఒగా నారాయుడు

ప్రజాశక్తి - సీతంపేట

ఉప విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు పాలక నారాయుడు శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఐటిడిఎ పిఒ పవర్ స్వప్నిల్ జగన్నాథ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. పిఒ ఆశయాల మేరకు కష్టపడి పని చేయడానికి కృషి చేస్తామని చెప్పారు. గిరిజన విద్య బలోపేతానిక, ముస్తాబు కార్యక్రమం అమలుకు కృషి చేస్తానన్నారు.

యువతకు వాలీబాల్ టోర్నమెంట్

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని కిచ్చాడ పంచాయతీ పరిధిలో గల పట్టాయిదొరవలసలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ గోల గౌరీశంకరరావు జ్ఞాపకార్థం గ్రామ యువత ఆధ్వర్యంలో శనివారం వాలీబాల్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక సర్పంచ్ గవర రాజ్యలక్ష్మి పాల్గొని రిబ్బన్ కట్ చేసి టోర్నమెంట్‌ను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గౌరీశంకరరావు గ్రామానికి సేవచేసి, వ్యక్తిత్వం, సామాజిక కార్యకలాపాల్లో చూపిన చొరవ చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన స్ఫూర్తితో యువత క్రీడలు, సామాజిక సేవల్లో మరింత చురుగ్గా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువత పాల్గొన్నారు.

గౌరీశంకర్ సంస్మరణ సభలో మాట్లాడుతున్న సర్పంచ్ రాజ్యలక్ష్మి

స్త్రీ చైతన్యం సమాజాభివృద్ధికి నాంది

సావిత్రీబాయి పూలే జయంతి వేడుకల్లో గంటేడ

ప్రజాశక్తి - పార్వతీపురం

స్త్రీ చైతన్యం, సమాజాభివృద్ధికి నాంది పలుకుతుందని జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవ అధ్యక్షులు, ప్రముఖ కవి, రచయిత గంటేడ గౌరునాయుడు అన్నారు. పట్టణంలోని ఆర్కే జూనియర్ కళాశాలలో జెవివి జిల్లా అధ్యక్షులు వి.దాలినాయుడు అధ్యక్షతన సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడైతే మహిళ చైతన్యవంతం అవుతుందో అక్కడే అభివృద్ధి సాధ్యమన్నారు. ఎక్కడ స్త్రీ ఆలోచనలకు తావుంటుందో అక్కడ చక్కని చైతన్య ఉంటుందన్నారు. చదువుతోనే చైతన్యం వస్తుందన్నారు. సావిత్రీబాయి పూలే ఒక రైతు కుటుంబంలో జన్మించారన్నారు. చిన్న వయసులోనే జ్యోతిరావుపూలేను వివాహమాడారన్నారు. భర్త ప్రోత్సాహంతో సంఘ సంస్కర్తగా, ఉపాధ్యాయురాలిగా, రచయిత్రిగా, నిమ్న వర్గాల అభ్యున్నతికి కృషి చేశారన్నారు.

విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న కవి గంటేడ గౌరునాయుడు

ఆధునిక విద్యుత్ ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యపడుతుందని ఆమె నమ్మారన్నారు. భర్త సహాయంతో 1848 జనవరి 1న పూణేలో మొట్టమొదటిగా బాలికల పాఠశాల ప్రారంభించారన్నారు. కుల వ్యవస్థకు పితృస్వామ్యానికి వ్యతిరేకంగా శూద్రుల అస్పృశ్యుల మహిళల సకల హక్కుల కోసం పోరాటం చేయటం తమ సామాజిక బాధ్యతగా ఆమె విశ్వసించారన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న జెవివి రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలక రంజిత్ కుమార్ మాట్లాడుతూ సమాజంలో ఎన్ని అడ్డంకులు ఎదురైనా ఆమె మొక్కవోని దీక్షతో ధైర్యంగా ఎదుర్కొని అనుకున్నది సాధించారన్నారు. నూతల వ్యవస్థ కోసం ప్రాణాలు సైతం ఫలంగా పెట్టి సమిష్టి పోరాటం చేశారన్నారు. ఆవే ఆధునిక భారతదేశంలో మొట్టమొదట మహిళా ఉపాధ్యాయులు అన్నారు. పీడిత ప్రజలు ముఖ్యంగా స్త్రీల విద్య అభివృద్ధికి కృషి చేసిన తొలితరం మహిళ ఉద్యమకారిణిగా అభివర్ణించారు. ఈ సందర్భంగా ఆ కళాశాలలోని మహిళా అధ్యాపకులను సత్కరించారు. కార్యక్రమంలో జలవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి దానాల చంద్రమౌళి, జిల్లా కమిటీ సభ్యులు పరుశురామ్, కళాశాల ప్రిన్సిపాల్ మడక అప్పలనాయుడు, గొట్టాపు ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

బాలల విద్యా పోషణాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

బాలల విద్యా, పోషణాభివృద్ధిపై అంగన్వాడీ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎస్‌టి కమిషన్ సభ్యులు కద్రక మల్లేశ్వరరావు సూచించారు. గుమ్మలక్ష్మీపురం అంగన్వాడీ కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించారు. అంగన్వాడీ కేంద్రంలో అమలు చేస్తున్న ముస్తాబు కార్యక్రమాన్ని పరిశీలించారు. అంగన్వాడీ పిల్లలతో స్నేహపూర్వకంగామమేకమై తెలుగు పాటలు, పద్యాలు పాడించారు. ఇంగ్లీష్ పదాలు అడిగి పిల్లల అభ్యాసస్థాయి, మేధస్సును పరిశీలించారు. బాలల సమగ్ర అభివృద్ధి, విద్యకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యం అభినందనీయమన్నారు.అనంతరం గ్రంథాలయానికి వెళ్లి అక్కడ నిర్వహిస్తున్న రికార్డులు, పరిపాలనా విధానాలను పరిశీలించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎన్.శేఖర్, సర్పంచ్ బొత్తాడ గౌరీ శంకర్, ఎస్టీ సెల్ కన్వీనర్ మండంగి భూషణరావు ఉన్నారు.

బియ్యాలవలసలో ...

కురుపాం : మండలంలోని బియ్యాలవలసలో ఎపిఎం బి.వెంకట్ ఆధ్వర్యాన మహిళా సంఘాల సభ్యులకు గ్రామ, కుటుంబ ముస్తాబు కార్యక్రమాలపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అయను మాట్లాడుతూ కుటుంబ ఆరోగ్యం, శుభ్రత, పిల్లల పోషణ, గృహ పరిశుభ్రత, ఆహారం తినే ముందు పాటించాల్సిన నియమ నిబంధనలు వంటి అంశాలను వివరించారు. మహిళా సంఘాలు గ్రామాభివృద్ధికి పునాది కావాలని, ప్రతి కుటుంబంలో ముస్తాబు కార్యక్రమాలు అమలు చేస్తే ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమవుతుందన్నారు. అనంతరం మహిళలు సంఘబలం, ఆర్థిక క్రమశిక్షణ, పొదుపు అలవాట్లు, రుణాల వినియోగం, సంఘాల ద్వారా గ్రామాభివృద్ధి సాధ్యమని, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను ప్రతి మహిళ చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిసిలు శ్రీనివాస్, సుందరరావు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురంలో అంగన్‌వాడీ చిన్నారులతో ముచ్చటిస్తున్న మల్లేశ్వరరావు ; కురుపాంలో అవగాహన కల్పిస్తున్న ఎపిఎం

సీతంపేట : మండలంలోని కుడ్డపల్లిలో గ్రామ, కుటుంబ ముస్తా కార్యక్రమాన్ని ఎంపిడిఒ మిశ్రా, పంచాయతీ కార్యదర్శి పాపారావు ఆధ్వర్యాన నిర్వహించారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆరోగ్యం కాపాడుకోవాలని అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ నరసనమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మక్కువ : మండలంలోని కాశీపట్నంలో గల కస్తూర్బిబా గాంధీ పాఠశాలలో ముస్తాబు కార్యక్రమాన్ని ఎంపిడిఒ అర్జునరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులంతా శుభ్రంగా ఉండాలని, ఉత్సాహంతో తరగతి గదిలో పాఠాలు వినాలని సూచించారు. శుభ్రంగా ఉంటేనే ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు బాగా అభ్యసించవచ్చని చెప్పారు. ఆనంద లహరి కార్యక్రమంలో ఎంపిడిఒ, ఎస్ఒ నాగదుర్గ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంధులు అంతర్జాతీయ స్థాయికి వెళ్లేలా ప్రోత్సాహం

చినజీయర్ స్వామి

ప్రజాశక్తి - సీతంపేట

విశాఖపట్నంలోని నేత్ర విద్యాలయ పాఠశాలలో చదువుతున్న అంధులకు సాంకేతిక విద్యతో పాటు క్రీడలు, ఆటపాటల్లో అంతర్జాతీయ స్థాయికి వెళ్లేందుకు వికాస తరంగణి కేంద్ర కార్యాలయం ప్రోత్సహిస్తుందని చినజీయర్ స్వామి పిలుపునిచ్చారు. మండలంలోని మారుమూల గిరిజన ప్రాంతమైన సీధి గిరిజన గ్రామంలో శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి ఆధ్వర్యంలో ప్రజలకు రగ్గులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎక్కడున్నా అంధులకు పాఠశాలలో చేర్పిస్తే విద్యతో పాటు అన్ని సౌకర్యాలు ఉచితంగా అందిస్తామని అన్నారు. మంచి ద్వారా మానవత్వంతో మనసు వీక్షిస్తుందని చెప్పారు. మాధవసేవ సర్వ ప్రాణిసేవ అని పిలుపునిచ్చారు. ఏజెన్సీలో పెరిగిన వనరులను మంచిగా వాడుకొని పెంచుకోవాలని, జంతువులను సంరక్షించుకోవాలని అన్నారు. చెట్లు, పశువులు ప్రకృతి వనరులు వల్ల మనకు ఎన్నో లాభాలు ఉన్నాయన్నారు. కుటుంబాల్లో మహిళలు ఆరోగ్యంగా ఉంటే అంతా ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఆరోగ్యంతో పాటు పిల్లలకు చదువు ఉండాలని అన్నారు. అనంతరం సుమారు 3000 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అవధానులు రామాంజనేయులు, స్వామి వికాస తరంగణి వర్మ, పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పడాల భూదేవి, మన్య ప్రగతి చైర్మన్ గేదెల రవి, గేదెల జనార్ధనరావు, టిడిపి నాయకులు గండి రామునాయుడు, లోతుగెడ్డ తులసి, వరప్రసాద్, మాజీ ఎంపిటిసి జయలక్ష్మి, దమయంతి నాయుడు, పాలకొండ సిఐ ప్రసాద్, సీతంపేట, దోనుబాయి ఎస్సైలు అమ్మన్న రావు షేక్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న చినజీయర్‌స్వామి

ఆర్‌డిఎస్, గులి రాగి పరిశీలన

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని ఇటికవలసకు చెందిన రైతు కరణం సత్యనారాయణ తన రెండు ఎకరాల మెట్టులో ఆర్‌డిఎస్ (రిసిజ్జువల్ డ్రై సోయింగ్) పద్ధతిలో ఉలవ పంటతో కలిపి తోటకూర, కంది, బొబ్బర ఇతర కూరగాయల విత్తనాలను కలిపి చల్లారు. ఈ విధానాన్ని పరిశీలించిన మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతి రావు మాట్లాడుతూ భూమిలో ఉన్న కొద్దిపాటి తేమను సద్వినియోగం చేసుకొని నేలను పూర్తిగా కప్పి ఉంచి ఏడాది పొడవునా ఎండవేడికి గురికాకుండా చూడడమే ఆర్‌డిఎస్ పద్ధతిలో ప్రధానమని ఇలా చేయడం వల్ల నేలలో ఉన్న జీవ వైవిధ్యం పెరిగి భూసారం పెరుగుతుందని అన్నారు. ఎండ వేడిమికి గురికాకుండా ఉండడం వల్ల మృత్తిక శీనత జరగకుండా కాపాడుతుందని ప్రధాన పంట ఆదాయం తీసుకున్న తర్వాత మిగతా పంటలు ఆదాయాన్ని ఇవ్వడమే కాకుండా ఎక్కువ కాలం నేలను కప్పి ఉంచుతాయని, కావున రైతులు మెట్టు పంటల్లో మొక్కజొన్న పూర్తయిన తర్వాత లేదా వరి కోతలు పూర్తి అయిన తర్వాత పలు రకాల విత్తనాలను కలిపి చల్లుకున్నట్లయితే నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు అని అన్నారు. వచ్చే ఖరీఫ్ పంటల దిగుబడి బాగుంటుందని, పొలాల్లో మిత్ర పురుగులు వృద్ధి జరగడమే కాకుండా కలుపు నివారణ జరగడం వల్ల రసాయన కలుపు నివారణలపై ఆధారపడడం తగ్గుతుందని తద్వారా పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. అనంతరం కర్రివలస గ్రామ రైతు లండ నారాయణరావు వేస్తున్న గులి రాగి పద్ధతిలో వేస్తున్న చోడి పంటను పరిశీలించారు ఈ కార్యక్రమంలో సిఆర్పి విజయ్ మరియు ఐసిఆర్పి సుమలత పాల్గొన్నారు.

రైతులకు శాశ్వత భూహక్కు పత్రాలు పంపిణీ : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కొమరాడ

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు శాశ్వత భూహక్కు పత్రాలు పంపిణీ చేయడం సంతోషకరంగా ఉందని ప్రభుత్వ విప్, కురుపా ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని దలైయపేటలో రైతులకు భూహక్కు పత్రాల పాసు పుస్తకాలను ఎమ్మెల్యే శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రాజముద్రలతో పాస్ పుస్తకాలను పంపిణీ చేసి రైతుల మనసులో చిరస్థాయిగా నిలిచిపోయిన ప్రభుత్వం అని అన్నారు. మండలంలో 26 గ్రామాల్లో గతంలో ప్రభుత్వం రీ సర్వే ప్రక్రియ పూర్తి చేసిందన్నారు. రీసర్వే పూర్తయిన గ్రామాల్లో రైతులకు సంబంధించిన పాస్ పుస్తకాలను పంపిణీ చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పట్టాదారు పాస్ పుస్తకాల్లో రైతులకు సంబంధించిన వివరాలు

పట్టాదారు పాసుపుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

తప్పిదాలుంటే రెవెన్యూ శాఖ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ సత్యనారాయణ, టిడిపి అరకు పార్లమెంటరీ రైతు అధ్యక్షులు దేవకోటి వెంకట నాయుడు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.శేఖర్ పాత్రుడు, నాయకులు సుదర్శన్‌రావు మధుసూదన్ రావు, స్థానిక కుటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

పార్వతీపురం: మండలంలోని వెంకంపేటలో శనివారం సబ్ కలెక్టర్ వైశాలి రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూ సమస్యలు లేకుండా పాసుపుస్తకాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. అనంతరం గ్రామంలోని రేషన్ డిపోను తనిఖీ చేశారు. స్టాకు రికార్డులను పరిశీలించారు. ఆమె వెంట తహశీల్దార్ సురేష్, విఆర్వోలు, గ్రామ పెద్దలు వున్నారు.

రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు అందజేస్తున్న సబ్‌కలెక్టర్ వైశాలి

పాలకొండ : మండలంలోని పనుకువలస సచివాలయంలో ప్రభుత్వం పంపిణీ చేసిన కొత్త పాస్ పుస్తకాలను సబ్ కలెక్టర్ స్వప్నల్ శనివారం పంపిణీ చేశారు. అనంతరం రైతులతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి పలు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ రాధాకృష్ణమూర్తి, మాజీ జెడ్పిటిసి సామంతుల దామోదరరావు ఉన్నారు.

బలిజిపేట : రైతులకు మేలు చేకూర్చేలా ప్రభుత్వం రాజముద్రతో భూహక్కు పత్రాలు మంజూరు చేస్తుందని తహశీల్దార్ బాలమురళీకృష్ణ తెలిపారు. శనివారం బర్లి, బడేవలస, చాకరాపల్లి, బైరిపురం తదితర గ్రామాల్లో రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను ఆయన రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో సర్వే చేసి ఎటువంటి వివాదాలు, ఇబ్బందుల్లేని భూమికి పాసు పుస్తకాలను సంబంధిత రైతులకు అందజేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని 16 గ్రామాల్లో సర్వే పూర్తి చేసి 7565 పాస్ పుస్తకాలను రైతులకు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని తహశీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

వీరఘట్టం : మండలంలోని దశమంతపురంలో రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను తహశీల్దార్ విఎస్ కామేశ్వరరావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు హక్కు పట్టాదారు పాసుపుస్తకామేనన్నారు. ఈ పుస్తకంలో ఎలాంటి తప్పులున్నా తమ దృష్టికి తీసుకురావాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి కుమారస్వామి, ఎంఆర్ఐ రవిజేత, విఆర్ఒ రాజేంద్రప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

జన వానికి విశేష స్పందన

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జనవాని కార్యక్రమానికి విషేస్ స్పందన లభించింది. పాలకొండ నగర పంచాయతీతో పాటు మండలం, సీతంపేట, వీరఘట్టం, భామిని మండలాల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన భూ సమస్యలపై వినతులు వచ్చాయి. మొత్తంగా 143 వినతులు రాగా, వాటిని ఎమ్మెల్యే స్వీకరించి అర్జీదారులతో మాట్లాడారు. వీటన్నింటిని పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి అరకు పార్లమెంటరీ అధికార ప్రతినిధి గంట సంతోష్ కుమార్, జనసేన పట్టణ నాయకులు కొండదాడి రాజేష్, ఉదయాన ఉదయభాస్కర్ తదితరులు ఉన్నారు.

సైబర్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలి

కురుపాం : సైబర్ మోసాలకు లోను కాకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని డిఎస్‌పి ఎం. రాంబాబు అన్నారు. శుక్రవారం రాత్రి మండలంలోని గుమ్మ గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకుల పేరుతో వచ్చే నకిలీ ఒటిపిలు, ఎపికె ఫైల్స్‌ను ఎవరూ తెరవొద్దని, ఇటువంటి ఫైళ్లను తెరిస్తే బ్యాంకు ఖాతాల్లో ఉన్న డబ్బును సైబర్ నేరగాళ్లు దోచుకునే అవకాశం ఎక్కువగా ఉంటుందని హెచ్చరించారు. కావునా ప్రజలు అప్రమత్తంగా ఉండి అనుమానాస్పద లింకులు, కాల్స్‌కు స్పందించవద్దని సూచించారు. కార్యక్రమంలో సిఐ హరి, ఎస్ఐ పి. నారాయణరావు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సావిత్రీబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

ప్రతి మహిళా సావిత్రీబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిర విద్యార్థులకు సూచించారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సావిత్రీబాయి పూలే జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. గతంలో బాలికలు చదువుకోడానికి ఎన్నో ఆకంకాలు వచ్చాయని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. పిల్లల నుంచి వృద్ధుల వరకు మహిళలపై లైంగిక దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఆడపిల్లలను తక్కువగా చూస్తున్నారని, సావిత్రీబాయి పూలే చేసిన సేవలను కొనియాడారు. తొలుత సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు ఇందిరాదేవి, ఉమాదేవి, ఝాన్సీ, ప్రమీణారాణి, సంధ్యారాణి, కామేశ్వరి, స్వాతి, ఊర్మిలాదేవి, సిఐటియు నాయకులు ప్రసాదరావు, ఎస్.పద్మరాజు విద్యార్థులు పాల్గొన్నారు.

సాలూరు : పట్టణంలో సావిత్రీబాయి పూలే జయంతోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఐద్వా నాయకులు

సీతానగరంలో నివాళ్లు అర్పిస్తున్న విద్యార్థులు

సాలూరు : సావిత్రీబాయి పూలేకు నివాళ్లు అర్పిస్తున ఐద్వా నాయకులు

బి.సంగీత, టి.తవుడుఅమ్మ మాట్లాడుతూ దేశంలో స్త్రీలకు విద్యా హక్కు సాధనకు పాటుపడిన సావిత్రీబాయి పూలే ఆశయ సాధనకై మహిళలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సనాతన మూఢాచారాలు వ్యాప్తి చెందిన కాలంలోనే బాలికలకు విద్యను అందించేందుకు సొంతంగా పాఠశాలలు నెలకొల్పారని, వితంతు వివాహాలు జరిపించేందుకు, బాల్యవివాహాలను అరికట్టేందుకు ఆమె విశేషమైన కృషి చేశారని అన్నారు. సావిత్రీబాయి పూలే వంటి సంఘసంస్కర్తల త్యాగాల ఫలితంగానే ఈరోజు దేశంలో మహిళల జీవన పరిస్థితులు మెరుగుపడ్డాయని, మూఢవిశ్వాసాలు తొలగించబడ్డాయని తెలిపారు. బాలికలకు విద్యను అందించాలనే చిత్తశుద్ధి ఈరోజు ప్రపంచ వ్యాప్తంగా విస్తరించిందంటే ఇలాంటి సంఘసంస్కర్తల త్యాగాల ఫలితమేనని, అలాంటి త్యాగాలు ఫలితంగా వచ్చిన హక్కుల సాధనకు మహిళలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐద్వా సాలూరు పట్టణ నాయకులు దేవి, పావని, ఈశ్వరి, సుమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని బొక్కుపేట ప్రాథమిక పాఠశాలలో ఘనంగా సావిత్రి బాబాయ్ పూలే జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.కృష్ణదాస్ మాట్లాడుతూ మొట్టమొదటిసారి ఉపాధ్యాయునిగా పనిచేసి అనేక మంది మహిళలకు విద్య, వితంతు వ్యవహారాలపై పోరాటాలు చేశారన్నారు. మహిళలకు సమాజంలో ఒక గుర్తింపు ఇవ్వాలని పోరాటం చేసిన మొట్టమొదటి మహిళ సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. అనంతరం విద్యార్థులకు పూలు మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గౌరీశంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

పాలకొండ : సావిత్రిబాయి పూలే జయంతిని పట్టణంలో గల సిరి స్కూల్ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిసి ప్రజా వెల్ఫేర్ అసోసియేషన్ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు సావిత్రిబాయి పూలే జీవిత చరిత్ర, ఆమె చేసిన సంస్కరణలను విద్యార్థులకు గురించి వివరించారు. ఆమె జయంతిని ప్రభుత్వ కార్యక్రమంగా నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిరి స్కూల్ ప్రిన్సిపాల్ పడాలి రవి, బిసి ప్రజా వెల్ఫేర్ అసోసియేషన్ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ప్రధాన కార్యదర్శి కనపాక ధనుంజయ, పాలకొండ నియోజకవర్గం అధ్యక్షులు దిలీప్ కుమార్, పాఠశాల మహిళా ఉపాధ్యాయులు సిబ్బంది వి విద్యార్థులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : విద్యార్థులు సావిత్రీబాయి పూలేలా ఉపాధ్యాయులుగా ఎదగాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీ వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ డి.రామయ్య కోరారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో సావిత్రీబాయి పూలే జయంతి సభ చరిత్ర అధ్యాపకులు శ్రీవాణి ఆధ్వర్యాన నిర్వహించారు. అనంతరం రామయ్య మాట్లాడుతూ క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాలేజీ ఐక్యూ కో-ఆర్డినేటర్ స్వరూప, అధ్యాపకులు ప్రభాకర్, తులసి, కృష్ణారావు, జమ్మయ్య, సత్యారావు, చిన్నారావు పాల్గొన్నారు.

విద్యార్థులతో కలిసి డాన్స్ చేస్తున్న పిఒ పవార్ స్వప్నల్

డ్యాన్స్‌తో మానసిక ఉల్లాసం : పిఒ

ప్రజాశక్తి - సీతంపేట

జిల్లా కలెక్టర్ ప్రవేశపెట్టిన మన్యంలో డ్యాన్స్ కార్యక్రమం ద్వారా పాఠశాల విద్యార్థులకు మానసిక ఉల్లాసం కలుగుతుందని ఐటిడిఎ పిఒ పవార్ స్వప్నిల్ అన్నారు. శనివారం ఆయన హడ్డుబంగి బాలికల ఆశ్రమ పాఠశాలలో డాన్స్ కార్యక్రమాన్ని హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి డాన్స్ వేశారు. ఈ డాన్స్ వల్ల విద్యార్థుల్లో చురుకుదనం అలవడుతుంద న్నారు. ప్రతి శనివారం అన్ని పాఠశాలల్లో మన్యంలో డ్యాన్స్ కార్యక్రమం అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా సామరెల్లి గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను పిఎంఆర్‌సి జిసిటిఒ రాములమ్మ సందర్శించారు. ముస్తాబు కార్యక్రమం గురించి అడిగి తెలుసుకున్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు హారిక భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

సాలూరు : విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేసిన యుటిఎఫ్ నాయకులు

విద్యార్థుల శ్రేయస్సే యుటిఎఫ్ ధ్యేయం

ప్రజాశక్తి - సీతానగరం

ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారంపై పోరాటమే కాకుండా విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి యుటిఎఫ్ కృషి చేస్తుందని మండల యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి బొత్స ప్రసాదరావు అన్నారు. మండలంలోని ఆర్.వెంకంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షల మెటీరియల్ పంపిణీ చేశారు. విద్యార్థులంతా చక్కగా చదివి మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాగాన వెంకటనాయుడు మాట్లాడుతూ యుటిఎఫ్ చేస్తున్న ఈ కార్యక్రమం అభినందనీయమని ప్రశంసించారు. విద్యార్థులు మెటీరియల్‌ను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల యుటిఎఫ్ సహాధ్యక్షులు బూరాడ ఆదినారాయణ, కౌన్సిల్ సభ్యులు వెన్నెల తవిటి నాయుడు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాలూరు : మండలంలోని శివరాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యుటిఎఫ్ సాలూరు మండల శాఖ ఆధ్వర్యాన సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం టెన్త్ విద్యార్థులకు టెస్ట్ పేపర్ లను విద్యార్థులకు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా సహా అధ్యక్షులు బి.విజయ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలంటే భయపడకుండా ఈ వంద రోజులు ప్రణాళిక బద్ధంగా చదివి మంచి ఉత్తీర్ణతలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా సీనియర్ ఉపాధ్యాయులు టి.రాజమణి, ఈశ్వరమ్మను సత్కరించారు. కార్యక్రమంలో మండల యుటిఎఫ్ నాయకులు గణేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గెడ్డలుప్పి రోడ్డు నిర్మాణం పూర్తి

ప్రజాశక్తి సీతానగరం

మండలంలోని గెడ్డలొప్పి జంక్షన్ నుంచి వంతెన మీదుగా కొత్తవలస వెళ్లే రోడ్డు బిటి రోడ్డు నిర్మాణ పనులు పూర్తి కావచ్చాయి. ఈ రోడ్డు పనులు చేపట్టడంతో ఆ గ్రామ ప్రజల ఎన్నో ఏళ్ల కళ నిజమవుతుందని వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి కావడంతో సంక్రాంతి పండగ ముందుగానే ఆ గ్రామానికి వస్తుందని గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

ఎంఇఒకు పుస్తకాలు అందజేస్తున్న కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి

నోట్ బుక్స్ పంపిణీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పాఠశాల విద్యార్థులకు జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి నోట్ బుక్స్ అందజేశారు. నూతన సంవత్సరం సందర్భంగా పూల బొకేలు బదులుగా నోట్ బుక్స్ తో తమకు శుభాకాంక్షలు తెలియజేయాలని జిల్లా కలెక్టర్ సూచించిన విషయం తెలిసిందే. దీంతో జిల్లా అధికారులంతా కలెక్టర్ కు విభిన్నంగా నోట్ పుస్తకాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇలా వచ్చిన సుమారు నాలుగువేల నోటు పుస్తకాలను డిఇఒ మాణిక్యం నాయుడు సమక్షంలో విద్యాశాఖ అధికారులకు శనివారం తమ క్యాంప్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అందజేశారు. విజయనగరం, గంట్యాడ, బొండపల్లి మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న నాలుగు, ఐదు తరగతి విద్యార్థులకు ఈ నోట్ పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేయనున్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్. సేథు మాధవన్, విజయనగరం ఎంఇఒ లలిత కుమారి, ఎసి సన్యాసిరాజు తదితరులు పాల్గొన్నారు.

అతిథి ఉపాధ్యాయుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలోని ఆదర్శ పాఠశాలల్లో అతిథి ఉపాధ్యాయుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని డిఇఒ యు.మాణిక్యంనాయుడు తెలిపారు. తెర్లాం మోడల్ స్కూలులో పిజిటి కామర్స్, శిఖరుగంజి, బక్కునాయుడు పేట పాఠశాలల్లో పిజిటి ఎకనామిక్స్ ఖాళీ ఉన్నట్లు తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో పీజీ లో 50శాతంమార్కులు, బిఇడి అయి ఉండాలని తెలిపారు. అభ్యర్థులు పూర్తి వివరాలతో సంబంధిత ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్‌ను ఈనెల 4 సాయంత్రం 4గంటల్లోగా సంప్రదించి దరఖాస్తు అందజేయాలని తెలిపారు. సెలెక్ట్ అయిన అభ్యర్థులకు నెలకు రూ.12వేలు గౌరవ వేతనం ఇస్తారని పేర్కొన్నారు.

జాతీయ టెన్నిస్ పోటీల్లో ఉపాధ్యాయుడికి బంగారు పతకం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

డిసెంబర్ 16 నుండి 22 వరకు గుజరాత్ రాష్ట్రంలోని గాంధీనగర్ లో జరిగిన ఆలిండియా సివిల్ సర్వీసెస్ టెన్నిస్ టోర్న మెంట్ లో అయ్యన్నపేట ఎంపిపి స్కూల్ ఉపాధ్యాయుడు గా పనిచేస్తున్న టి.రామారావు జాతీయ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా ఆయనను డిఇఒ యు.మాణిక్యం నాయుడు అభినందించారు.

సీతం విద్యార్థులకు కాంస్య పతకాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్థానిక గాజులరేగ పరిధిలోగల సీతం కళాశాలలో ఇంజినీరింగ్ తృతీయ సంవత్సరం ఇసిఇ విభాగానికి చెందిన వి.శివ పురుషుల జావలిన్ త్రో ఈవెంట్లో కాంస్య పతకం, బి.హరీష్ ట్రిపుల్ జంప్‌లో కాంస్య పతకం సాధించారు. ఈ అంతర కళాశాల అథ్లెటిక్స్ పోటీలు జెఎన్‌టియు ఆధ్వర్యంలో డిసెంబరు 29,30 తేదీలలో జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన క్రీడా అభినందన సభలో సీతం కళాశాల సంచాలకులు మజ్జి శశిభూషణ రావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో నైపుణ్యాన్ని సంపాదించుకోవాలని కోరారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి బబిత

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా శనివారం స్థానిక గురజాడ స్కూలులో జన విజ్ఞాన వేదిక, జిల్లా సేవాధికార సంస్థ ఆధ్వర్యాన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లాజడ్జితో పాటు పోక్సో కోర్టు న్యాయమూర్తి నాగమణి, డిఎల్ఎస్ కార్యదర్శి, సివిల్‌జడ్జి ఎ.కృష్ణప్రసాద్ హాజరయ్యారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బబిత మాట్లాడుతూ విద్యార్థులకు ఉపయోగపడే వివిధ రకాల చట్టాలపై అవగాహన కల్పించడంతో పాటు విద్యార్థుల ప్రవర్తన ఏ విధంగా ఉండాలో వివరించారు. ప్రత్యేక అతిథి నాగమణి మాట్లాడుతూ లైంగిక నేరాల పట్ల జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తూ విద్యార్థి దశలో చట్టాలపై అవగాహన బంగారు భవిష్యత్ కు బాటలు వేస్తుందని అన్నారు.. సివిల్ జడ్జి ఎ.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ పాఠశాలల్లో జరుపుకునే వివిధ రకాల కార్యక్రమాలు, సమాజం పట్ల భాధ్యతలను విద్యార్థులకు వివరించారు. జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు డాక్టర్ ఎంవిఆర్ కృష్ణాజీ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే 175ఏళ్ల క్రితం తీసుకున్న నిర్ణయాలు, చూపించిన సాహసాలు నేటికీ మహిళా లోకానికి ఆదర్శంగా నిలిచాయని అన్నారు. కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.సత్యం మాట్లాడుతూ నేడు మహిళలు అత్యున్నత స్థాయికి చేరగలగడానికి మొదటి మెట్టు నాటి సావిత్రిబాయి పూలే అని అన్నారు. కార్యక్రమంలో జెవివి రాష్ట్రకోశాధికారి డాక్టర్ పి.రమేష్‌రాజు నాయకులు గండ్రేటి అప్పలనాయుడు, కరస్పాండెంట్ ఎం.స్వరూప తదితరులు పాల్గొన్నారు.

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి బబిత

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమనిజిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం. బబిత అన్నారు. వంద రోజుల క్యాంపెయిన్‌లో భాగంగా జిల్లా కోర్టులో ఏర్పాటుచేసిన శిక్షణ, న్యాయ అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బాల్య వివాహాల నిరోధానికి సంబంధించి ఆశా వర్కర్లకు అంగన్వాడీ టీచర్లకు, పారా లీగల్ వాలంటీర్లకు అవగాహన కల్పించారు. 18ఏళ్ల లోపు బాల బాలికలకు వివాహం చేయడం చట్టరీత్యా నేరమని, అందుకు రెండేళ్ల వరకు జైలుశిక్ష, జరిమానా ఉంటాయని తెలిపారు. బాలికల తల్లిదండ్రులకు అవగాహన కల్పించే బాధ్యత అంగన్వాడీ, ఆశావర్కర్లదేనని అన్నారు. ఎవరైనా ఎక్కడైనా బాల్య వివాహం జరిగినట్లు తెలిస్తే వెంటనే చైల్డ్ లైన్ టోల్ ఫ్రీ నెంబర్ నెంబర్ 1098 కు లేదా టోల్ ఫ్రీ నెంబర్ 15100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ బిహెచ్ లక్ష్మి, డిస్ట్రిక్ట్ మిషన్ కోఆర్డినేటర్ ఎల్.సుజాత, నేచర్ ఎన్జీవో కోఆర్డినేటర్ దుర్గ, అంగన్వాడీలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల జోలికి పోవద్దు : ఎస్‌పి

ప్రజాశక్తి- కంటోన్మెంట్

జీవితాలను నాశనం చేసే మాదక ద్రవ్యాల జోలికి పోవద్దని ఎస్‌పి ఎఆర్ దామోదర్ అన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే దుష్ప్రభావాలను ప్రజలకు వివరించాలనే సంకల్పంతో విశాఖపట్నం రేంజ్ పరిధిలోని పాయకరావుపేట నుండి ఇచ్ఛాపురం వరకు సాగిన అభ్యుదయ సైకిలు యాత్ర నేటితో ముగియనుండడంతో సంఘీభావంగా జిల్లాలో 3 కిలోమీటర్ల 'వాక్ థాన్' నిర్వహించారు. నగరంలోని బాలాజీ జంక్షను నుంచి మూడు లాంతర్లు వరకు నిర్వహించిన 'వాక్ థాన్'కు ఎస్‌పి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల వలన కలిగే అనర్ధాలను ప్రజలకు వివరాలించాలనే సంకల్పంతో రేంజ్ ఐజిపి గోపీనాథ్ జట్టి రేంజ్ పరిధిలోని ఐదు జిల్లాలను కవర్ చేస్తూ 'అభ్యుదయ సైకిలు యాత్ర'ను నిర్వహించారన్నారు. చాలామంది యువత తెలిసీ తెలియని వయస్సులో కుతూహలంతోను, తోటి స్నేహితుల ఒత్తిడితోను డ్రగ్స్ వినియోగించి, వాటికి బానిసలుగా మారుతూ, చివరకు వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. డ్రగ్స్ ప్రభావం వాటిని వినియోగించే వ్యక్తుల ఆరోగ్యంపైనే కాకుండా, వారి కుటుంబ బంధాలు, అనుబంధాలు పైనా ప్రభావం చూపుతుందన్నారు. అంతేకాకుండా, డ్రగ్స్ ప్రభావంతో నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోలేరని, వృత్తి, చదువు, మానసిక స్థితిపైనా ప్రభావం చూపుతుందని, ఆర్థిక ఇబ్బందులకు గురికావడం, నేరస్థులుగా మారే పరిస్థితులను కల్పిస్తుందన్నారు. వారి జీవితాలను అంధకారంలోకి నెట్టేసే ఇటువంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని. డ్రగ్స్ జోలికి పోవద్దని యువతకు జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు. గంజాయి, మాదకద్రవ్యాలను (డ్రగ్స్) వినియోగించినా, విక్రయించి, రవాణకు పాల్పడినా చట్టాన్ని ఉల్లంఘించినట్లేనని అన్నారు. గత కొన్ని మాసాలుగా జిల్లా పోలీసుశాఖ చేపట్టిన చర్యలు ఫలితంగా గంజాయి తగ్గుముఖం పట్టిందన్నారు. జిల్లా పోలీసుశాఖ చేపడుతున్న చర్యలకు ప్రజలు కూడా చేయూతను అందించాలని కోరారు. కార్యక్రమంలో డిఎస్‌పి ఆర్.గోవిందరావు, సిఐలు ఎ.వి.లీలారావు, ఆర్‌విఆర్‌కె చౌదరి, టి.శ్రీనివాసరావు, సిహెచ్.సూరి నాయుడు, బి.లక్ష్మణరావు, ఈ.నర్సింహమూర్తి, ఆర్‌ఐ ఎన్.గోపాల నాయుడు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న ఎస్‌పి, పోలీసు అధికారులు, సిబ్బంది

రెవెన్యూ సమస్యలపై దృష్టి పెట్టండి : కలెక్టర్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జిల్లాలో పెండింగ్‌లో ఉన్న వివిధ రెవెన్యూ సమస్యలను, ప్రజల ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. రెవెన్యూ డివిజన్ల వారీగా సమస్యలపై సమీక్షించారు. వివిధ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, వాటిని పరిష్కరించడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా ఇనాం భూములు, ఎస్టేట్ భూములు, పట్టాదారు పాసుపుస్తకాలు జారీ, వెబ్ ల్యాండ్ సమస్యలు, జాయింట్ ఎల్‌పిఎంలు, రీ సర్వే సమస్యలు, భూమి మ్యుటేషన్ సంబంధిత సమస్యలు, భూ రికార్డుల్లోని తప్పుల సవరణ వంటి అంశాల్లో సామాన్యులకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదని కలెక్టర్ సూచించారు. అందుబాటులో ఉన్న వివిధ రకాల మాస్టర్ రికార్డులను ఆన్లైన్ చేయాలని ఆదేశించారు. ప్రజల భూ హక్కుల రక్షణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అధికారులకు సూ చించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్. సేథు మాధవన్, జిల్లా రెవెన్యూ అధికారి ఇ.మురళి, ఆర్డీవోలు డి.కీర్తి, సత్యవాణి, మోహనరావు, ఇతర రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి

పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ వేగవంతం

జిల్లాలో పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీని సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. టెలి కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశించారు. ఏ రోజుకు ఆ రోజు నిర్ణయించిన లక్ష్యాన్ని తప్పనిసరిగా చేరుకోవాలని, గ్రామ సభల ద్వారా పంపిణీ నిర్వహించి ప్రజాప్రతినిధులను పూర్తి స్థాయిలో భాగస్వాములను చేయాలని సూచించారు. రోజుకు 40వేల పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీ చేయాలని, స్పష్టం చేశారు. పట్టాదార్ పాస్ పుస్తకాలలో ఉన్న లోపాలను సరిదిద్దేందుకు అవకాశం ఉన్నందున, లోపాలను సరిదిద్దే ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు జాయింట్ కలెక్టర్ ఎస్. సేథు మాధవన్ మాట్లాడుతూ, రైతుల కెవైసి పెండింగ్ లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని, ప్రతి రోజూ లక్ష్యాన్ని సాధించేందుకు క్షేత్రస్థాయిలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. టెలి కాన్ఫరెన్సులో మూడు డివిజన్ల ఆర్‌డిఒలు, తహశీల్దార్లు పాల్గొన్నారు.